


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 162 విశాఖపట్నం, 8 ఏప్రిల్ 2025 మంగళవారం E-mail : vspnews@gmail.com,



# అప్పన్న కల్యాణం చూతమురారండి !

## రాత్రి 8.15లకు రథోత్సవం, 10.30కు కల్యాణం

### ఉత్సవానికి సిద్ధమైన రథం

### కల్యాణ కాంతులతో శోభిల్లుతున్న సింహగిరి

**సింహాచలం, విశాఖ సమాచారం:** సింహాచల క్షేత్రం కల్యాణ కాంతులతో కళకళలాడుతోంది. బ్రహ్మాది దేవతలు ఇంద్రాది దిక్పాలకులతో సింహాచలం తరలివచ్చి చైత్రశుద్ధ ఏకాదశి పర్వదినాన వరాహ నరసింహుడి కల్యాణం జరిపించినట్టు క్షేత్ర మహాత్మ్యం స్పష్టం చేస్తోంది. సాక్ష్యాత్తు బ్రహ్మదేవుడే కల్యాణోత్సవం జరిపించడం వలన వీటినే బ్రహ్మోత్సవాకూడా కూడా పిలుస్తారు. ఆనాటి నుండి స్వామివారి కల్యాణోత్సవం జరిపించడం సంప్రదాయంగా వస్తోంది. ఏటా చైత్ర శుద్ధ దశమి నాడు అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభించడం ...(మిగతా 2లో)



# మారుమూల గిరిజన గ్రామాలకూ రహదారులు

- గిరిజనులకు అండగా ఉంటాం
- రూ.1005 కోట్లతో 1069 కి.మీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**పాడేరు/ డుంబ్రిగుడ/అరకు వ్యాలీ, విశాఖ సమాచారామ్:** మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి గ్రామీణ అభివృద్ధి, పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన మన్యంలో సోమవారం విస్తృతంగా పర్యటించరు. చాపరాయి గెడ్డ నుండి కాలినడకన రెండు కిలోమీటర్లు ప్రయాణించి పోతంగి పంచాయతీ పెద పాడు గ్రామానికి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన ...(మిగతా 2లో)



# ఏపీ మహిళలకు బీపీ ఎక్కువ!

## సీఎం చంద్రబాబు

- అమరావతిలో గ్లోబల్ మెడ్‌సిటీ
- ఆంధ్రాలో 19.78లక్షల మందికి రక్తపోటు
- ఇందులో 11.40లక్షల మంది మహిళలే

వార్త 2లో





# బంగాళాఖాతంలో అల్పపీడనం..

- తేలికపాటి వర్షాలకు అవకాశం

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారం వరకు వాయవ్య దిశగా నైరుతి బంగాళా ఖాతం వైపు కదిలే అవకాశం ఉన్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాత 48 గంటలపాటు ఉత్తరంవైపు ప్రయాణిస్తూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి విస్తరించే అవకాశమున్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో ...(మిగతా 2లో)

# మార్కెట్లకు 'బ్లాక్ మండే'!

- ఆ నలుగురి నష్టం రూ. 85వేల కోట్లు

**స్టాక్ మార్కెట్లలో నష్టాలతో దేశంలోని నలుగురు సంపన్నుల సంపద భారీ స్థాయిలో కరిగిపోయింది. ఒక్క రోజులోనే వారికి రూ.85వేల కోట్ల నష్టం వాటిల్లింది.**



**ఇంటర్నెట్ డెస్క్:** ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కుదేలయ్యాయి. సెకన్ల వ్యవధిలో మార్కెట్లో రూ.లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఈ ప్రభావం దేశీయ కుబేరులపైనా తీవ్రంగానే పడిరది. టాప్-4 కుబేరుల సంపద ఈ ఒక్కరోజే 10 బిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో దాదాపు రూ. 85వేల కోట్లు) కరిగి పోయింది. ఈ మేరకు ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ జాబితా గణాంకాలు వెల్లడిరచాయి.

అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస కంపెనీ షేర్లు నేటి ట్రేడిరగ్‌లో భారీగా పతన మయ్యాయి. నిఫ్టీలో ఈ కంపెనీ షేరు విలువ దాదాపు 3.5శాతం కుంగింది. ఇంట్రాడేలో 7.4 శాతం నష్టంతో 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. దీంతో అంబానీ వ్యక్తిగత నికర సంపద ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30వేల కోట్లు) తగ్గి 87.7 బిలియన్ డాలర్లకు చేరింది. ...(మిగతా 2లో)

# అమరావతి నిర్మాణానికి రూ.4,200 కోట్లు విడుదల



**అమరావతి :** ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్ మెంట్ బ్యాంకు మద్దతుతో రూ. 4,200 కోట్లు విడుదల చేసింది. దీంతో అమరావతి అభివృద్ధి పనులు మరింత ఊపందుకోనున్నాయి. అమరావతి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పలుమార్లు రాష్ట్ర ఎంపీలు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి వల్లే రాష్ట్రానికి అధిక నిధులు అందుతున్నాయని తెలిపారు.



# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు

**ఢిల్లీ:** చమురు ధరలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ ని రూ.2 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెట్రో ధరల పెంపుపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ధరల్లో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసింది. ఎక్సైజ్ డ్యూటీ పెరుగుదల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో పెరుగుదల ఉండదని చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. కాగా.. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం పరస్పర ...(మిగతా 2లో)

# సామాన్యుడి నెత్తిన గ్యాస్ బండ

## ఒకే సారి రూ.50 పెంపు.. నేటి నుంచే అమలు



**ఢిల్లీ :** సామాన్యులకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరో షాకిచ్చింది. దేశ వ్యాప్తంగా భారీగా గ్యాస్ ధరలు పెంచింది. ఎల్పీజీ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉజ్వల పథకం సిలిండర్లపైనా రూ.50 పెంచుతున్నట్లు ప్రకటనలో పేర్కొంది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన వంట గ్యాస్ సిలిండర్ ధరలు మారుతుంటాయి. గత కొద్ది రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వరుస ...(మిగతా 2లో)



## బంగాళాఖాతంలో అల్పపీడనం..

(మొదటి పేజీ తరువాయి)

రాబోయే 3 రోజుల్లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఉత్తర కోస్తా, యానాంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రాబోయే 4 రోజుల్లో క్రమంగా 2 నుంచి 3 డిగ్రీలు పెరిగి, ఆ తర్వాత స్వల్పంగా తగ్గుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా, రాయలసీమలో గరిష్ఠంగా 2 నుంచి 4 డిగ్రీలు పెరిగి, ఆ తర్వాత స్వల్పంగా తగ్గే అవకాశముంది.

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

సుంకాల కారణంగా ట్రేడ్ వార్ వస్తుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ తరుణంలో ఎక్సైజ్ సుంకం పెంపు చోటుచేసుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినందున ఈ అదనపు భారాన్ని చమురు సంస్థలు సర్దుబాటు చేసుకుంటాయి.

## మార్కెట్లకు 'బ్లాక్ మండే'!

(మొదటి పేజీ తరువాయి)

అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కూడా 5శాతం మేర నష్టపోయాయి. దీంతో ఈ సంస్థ అధినేత గౌతమ్ అదానీ నికర సంపదలో 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25వేల కోట్లు) ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఆయన మొత్తం ఆస్తుల విలువ 57.3 బిలియన్ డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్స్ పేర్కొంది.

ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ నికర సంపద సోమవారం 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18వేల కోట్లు) మేర కుంగి 33.9 బిలియన్ డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ షేర్లు దాదాపు 7శాతం పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ఐటీ షేర్లు భారీగా కుదేలయ్యాయి. దిగ్గజ సంస్థ హెచ్‌సీహెల్ టెక్నాలజీస్ షేరు విలువ 3.3శాతానికి పైగా కుంగింది. దీంతో ఈ కంపెనీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ వ్యక్తిగత నికర సంపద 1.5 బిలియన్ డాలర్లు (రూ.12వేల కోట్లు) తగ్గి 30.9 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడిరచింది.

## సామాన్యుడి నెత్తిన గ్యాస్ బండ

(మొదటి పేజీ తరువాయి)

షాకులు ఇస్తూ వచ్చిన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఏప్రిల్ 1వ తేదీన గ్యాస్ సిలిండర్లకు సంబంధించి కొత్త రేట్లు ప్రకటించాయి. ఈసారి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ ప్రకటన చేసి వారం కూడా గడువకముందే మరోసారి రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

**పాయకరావుపేట, విశాఖసమాచారం :** : అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు ప్రమాద స్థలములోనే మృతి చెందగా.. మరో ఆరుగురుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. బంధువులకు సమాచారం అందించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని గుర్తించారు. ఈ ఘటనతో రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ కలెక్టర్ మృతి

### మరో నలుగురికి తీవ్రగాయాలు

**సంబేపల్లి, విశాఖ సమాచారం:** అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం యర్రగుంట్ల వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హంద్రీనీవా కెనాల్ (హెచ్‌ఎన్‌ఎస్) పీలేరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ (50) మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో బాధితులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. మృతిచెందిన డిప్యూటీ కలెక్టర్ రమ.. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె స్వస్థలం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. పీలేరు నుంచి రాయచోటిలోని కలెక్టరేట్ గ్రీవెన్స్ కార్యక్రమానికి రమ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా, రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ కలెక్టర్ రమ మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

# 2030 నాటికి ఏఐకి మానవ తెలివితేటలు !



### మానవాళికి ముప్పు : గూగుల్ అంచనా

**ఇంటర్నెట్ డెస్క్:** మానవ స్థాయి కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ 2030 నాటికి వస్తుందని గూగుల్ డీప్‌మైండ్ అంచనా వేస్తోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా అంతా ఏఐ మాయే. ప్రతి రంగంలోనూ ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ మానవ జీవితాలను మార్చివేస్తోంది. దీనివల్ల మానవాళికి ఎన్నో ఉపయోగాలు ఉన్నప్పటికీ.. అంతేమేర నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మానవ స్థాయి కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ 2030 నాటికి వస్తుందని.. ఇది మానవాళిని శాశ్వతంగా నాశనం చేస్తుందని గూగుల్ డీప్‌మైండ్ కొత్త పరిశోధన అంచనా వేసింది.

ఏజీఐ భారీ ప్రభావం దృష్ట్యా.. ఇది కూడా తీవ్రమైన హాని కలిగించే ప్రమాదం ఉందని తాము అంచనా వేస్తున్నట్లు పరి శోధకులు తెలిపారు. మానవాళిని నాశనం చేసే ప్రమాదాలు ఉన్నాయని ఈ పరిశోధనలో హెచ్చరించారు. అధునాతన ఏఐ వల్ల కలిగే ప్రమాదాలను ఈ అధ్యయనం పలు కేటగిరీలుగా విభజించింది. డేటాను దుర్వినియోగం చేయడం, తప్పులు, తప్పుగా పొందుపరచడం, స్ట్రక్చరల్ రిస్క్‌లాంటి ముప్పులు ఉన్నాయని పేర్కొంది. డీప్‌మైండ్ సహ వ్యవస్థాపకుడు షేన్‌లెగ్ సహ రచయితగా ఉన్న ఈ అధ్యయనం.. మానవాళికి ఏ రకంగా హాని చేస్తుందన్న విషయాలను స్పష్టంగా చెప్పలేదు. అయితే.. ఏజీఐ ముప్పును తగ్గించడానికి గూగుల్, ఇతర ఏఐ కంపెనీలు తీసుకోవాల్సిన నివారణ చర్యలను సూచించింది. మానవుల కంటే తెలివైన ఏజీఐ రాబోతోందని గత ఫిబ్రవరిలోనే డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హస్సాబిస్ తెలిపాడు. రాబోయే ఐదు లేదా పదేళ్లలో ఇది ఉద్భవిస్తుందని పేర్కొన్నాడు. ఏజీఐ పర్యవేక్షణపై ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థల తరపున ఆయన పోరాడుతున్నారు.

**ఏంటీ ఏజీఐ**

ఏఐకి మరో ముందడుగే ఈ ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఏఐ అనేది టాస్క్ స్పెసిఫిక్‌గా ఉండగా.. ఏజీఐ అనేది మానవ మేధస్సు మాదిరిగానే విస్తృత శ్రేణి పనులకు అన్వయించగల మేదస్సును కలిగి ఉండేలా లక్ష్యాలను పెట్టుకుంటుంది. ఏజీఐ అనేది మనుషుల్లానే.. విభిన్న డొమైన్‌లలో జ్ఞానాన్ని అర్థం చేసుకునే, నేర్చుకునే, అన్వయించగల సామర్థ్యం ఉన్న యంత్రం.

## ఏపీ మహిళలకు బీపీ ఎక్కువ!

**అమరావతి, విశాఖసమాచారం :** రాజధాని అమరావతిలో గ్లోబల్ మెడ్‌సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడిరచారు. వైద్యం, ఆరోగ్యంపై మీడియా ఎదుట సీఎం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పెరిగిన వైద్య ఖర్చులు, వివిధ వ్యాధులపై సీఎం వివరాలు తెలిపారు. "కుప్పంలో డిజిటల్ హెల్త్ నర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. కొన్నిచోట్ల గుండెజబ్బులు, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, శ్వాసకోశ వ్యాధులు విస్తృతంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళల్లో హైపర్‌టెన్షన్ అధికంగా కనిపిస్తోంది. ఆహారపు అలవాట్ల వల్ల డయాబెటిస్ కొన్ని జిల్లాల్లో ఎక్కువగా ఉంది" అని సీఎం వివరించారు. కార్డియోవాస్కులర్ డిసీజ్‌తో 18.22 శాతం మంది, షుగర్ వ్యాధితో 12.15 మంది బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే హృదయ సంబంధిత వ్యాధి గ్రస్తులు కోడా అధికంగానే ఉన్నారన్నారు. కోనసీమ, ఏపీలో క్యాన్సర్ బారిన 6.8శాతం మంది పడ్డారు. వీరిలో ఎక్కువగా గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాల ప్రజల ఉన్నారని చెప్పారు, ఏపీలో 19.78 లక్షల మంది బీపీతో బాధపడుతున్నారని వెల్లడిరచారు. 11.13 లక్షల మంది మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు వ్యాధులు ఉన్నవారు 20.78 లక్షల మంది అని తెలిపారు. 8.37 లక్షల మంది పురుషులకు బీపీ ఉంటే.. మహిళలో 11.40లక్షల మందికి ఉందన్నారు. రైస్ ఎక్కువగా తినే జిల్లాల్లో షుగర్ వ్యాధి వస్తుందన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఇది ఎక్కువగా ఉందన్నారు. బీపీ, షుగర్ రెండూ ఉన్నవారిలో మగవారే ఎక్కువమంది అని తెలిపారు.

**ఉప్పు, నూనె, చక్కెర తగ్గించండి**

"చాలా వ్యాధుల నివారణ కోసం మంచి ఆహారపు అలవాట్లు పాటించాల్సిందే. నలుగురు సభ్యులు కలిగిన సాధారణ కుటుంబం రోజుకు 4 గ్రాముల ఉప్పు చొప్పున నెలకు 600 గ్రాములనే తీసుకోవాలి. వంటనూనె కూడా రోజుకు 15 గ్రాములు చొప్పున నెలకు 2 లీటర్లు మాత్రమే వినియోగించాలి. చక్కెర రోజుకు 25 గ్రాముల చొప్పున నెలకు 3 కిలోలు వాడితే సరిపోతుంది. ఇది సమతుల్యమైన డైట్‌గా గుర్తించి నియంత్రణ చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉప్పు, వంటనూనె, చక్కెర వినియోగం తగ్గిస్తే చాలా వరకు అనారోగ్య సమస్యలు దరిచేరే అవకాశం ఉండదు. రోజుకు కనీసం అరగంట పాటు తేలికపాటి వ్యాయామం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రాణాయామం చేయాలని కూడా పిలుపు ఇస్తున్నా" అని చంద్రబాబు తెలిపారు.

## మారుమూల గిరిజన గ్రామాలకూ రహదారులు

(మొదటి పేజీ తరువాయి)





చేశారు. అనంతరం దుంబ్రిగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమం పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని అడిగిన 24 గంటల్లో రహదారుల నిర్మాణానికి రూ.49 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. అడవి తల్లిని నమ్ముకుంటే జీవనాధారం లభిస్తుందన్నారు. తనకు ప్రకృతి అడవి మీద అపారమైన ఇష్టం ఉందని చెప్పారు. ఏజెన్సీలో పర్యటిస్తుంటే అందమైన కాఫీ తోటలు, మిరియాల పంట, కటిక జలపాతం ఆహ్లాదకరంగా ఉన్నాయన్నారు. టూరిజం అభివృద్ధి చెందితే గిరిజనుల జీవనశైలి మెరుగు పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలలలో రూ.1005 కోట్ల వేగంతో 10 69 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఓట్లు వేయకపోయినా పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో రూ.555.61 కోట్ల వ్యయంతో 612.72 కిలోమీటర్ల రోడ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.399.66 కోట్ల వ్యయంతో 471.63 కిలోమీటర్ల రహదారులను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ కింద రూ. 49.73 కోట్లతో 48.85 కిలోమీటర్ల రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. 615 గ్రామాలకు రహదారి సదుపాయం ఏర్పడుతుందని, డోలిమోతలకు విముక్తి కలుగుతుందని పేర్కొన్నారు. గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రులతో మాట్లాడి పర్యాటక అభివృద్ధిని చేస్తామన్నారు. చాపరాయిగెడ్డ పై వంతెన నిర్మాణానికి కొంత సమయం ఇస్తే పర్యావరణానికి, టూరిజనికి ఇబ్బంది లేకుండా వంతెన నిర్మిస్తామని చెప్పారు . యువత టూరిజం వైపు ఆకర్షితులు కావాలని చెప్పారు. గంజాయి వంటి మాద కద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఉపాధి హామీ పథకంలో అనుసంధానం చేస్తూ ఏజెన్సీలో లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు చర్యలు చేపట్టా మన్నారు. నీడ తోటల పెంపకానికి సిల్వర్ ఓక్ కి ప్రత్యామ్నాయంగా పనస, మామిడి, నేరేడు మొక్కలను పెంచాలని సూచించారు. బస్తర్ అటవీ ప్రాంతంలో చెడుపులు, చిల్లంగులు పెట్టేవారు వచ్చారని 9 మందిని చంపిన సంఘటనలు ఉన్నాయని, అటువంటి మూఢనమ్మకాలను నమ్మకూడదని ఉద్రేకానికి లోనై చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని సూచించారు. అడవులకు మంట పెట్టడం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో 20 కోట్ల వ్యయంతో 30 మల్టీ పర్పస్ సెంటర్లను మంజూరు చేశామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రెండోసారి ఏజెన్సీలో పర్యటించి పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో స్వయంగా పర్యటించి సమస్యలు విని పరిష్కారం చేశారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు చర్యలు చేపట్టామని అన్నారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, రేగం మత్స్య లింగం, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జె సుభద్ర, ఎమ్మెల్సీ హరి ప్రసాద్ , పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, ఐటీడీఏ ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమని పటేల్, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న కల్యాణం చూతమురారండి !







(మొదటి పేజీ తరువాయి)

ఆచారంగా కొనసాగుతోంది. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి 7 గంటలకు ఆలయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, ఋత్విక్కువరణం, ఉత్సవాంగీకారం, ముత్స్యం గ్రహణం, అంకురార్పణతో వైదిక పెద్దలు కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ఏకాదశి నాడు ఉదయం విశేష హెూమాలు, మధ్యాహ్నం కొట్నాల ఉత్సవం, గ్రామ బలిహరణం, కల్యాణానికి సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం జరిపిస్తారు. సాయంత్రం ఎదుర్కోలు, రాత్రి 8 గంటల తరువాత గంగపుత్రుల్కైన జాలర్ల నిర్దేశకత్వంలో రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి పదిన్నర గంటలకు కల్యాణం ప్రారంభమవుతుంది. 9 వ తేదీ బుధవారం ఉదయం. విశేష హెూమాలు, సాయంత్రం శేష వాహనం పై తిరువీధి వేడుక నిర్వహిస్తారు. 10 వ తేదీ ఉదయం వైదిక సదస్యం, సాయంత్రం పండిత సదస్సు అనంతరం సర్వజన మనోరంజని వాహనంలో తిరువీధి జరిపిస్తారు. 11 వ తేదీన సాయంత్రం సూర్యప్రభ వాహనంలో తిరువీధి జరుగుతుంది. 12 వ తేదీ ఉదయం పూర్ణాహుతి, మంగళా శాసనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, అవబృదోత్సవాలు జరిపిస్తారు. రాత్రి మృగయోత్సవం (దొంగల దోపు) అశ్వ వాహనంలో తిరువీధి వేడుక, ధ్వజావరోహణం, సంవాదసేవ నిర్వహిస్తారు. 13 వ తేదీ చివరి రోజు వినోదోత్సవం (ఉంగరం సేవ), రాత్రి శ్రీ పుష్పయాగం ద్వాదశ ఆరాధనలు,సప్తావరణం, దర్పణ సేవ, సంవాద సేవలు విశేషంగా జరిపిస్తారు. పాంచాహ్నిక దీక్షతో జరిగే సింహాద్రి అప్పన్న కల్యాణోత్సవాల కోసం ఈఓ కె.సుబ్బారావు నేతృత్వంలో దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబానికి, ప్రభుత్వ పెద్దలకు అధికారులే స్వయంగా వెళ్లి ఆహ్వానం పలికారు. ఏడాది కళ్యాణ వేదిక కూడా మార్పుచేయడంతో ఏర్పాట్ల పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**సిద్ధమైన రథం..**

కల్యాణానికి ముందు స్వామివారి రథోత్సవం జరగనుంది. ఈమేరకు అన్ని హంగులు పూర్తి చేసుకుని సోమవారం రథాన్ని సిద్ధం చేశారు. జాలర్ల పెద్ద కుటుంబంతో వచ్చి రథానికి పూజలు చేశారు. చక్రాలకు పసుపు, కుంకుమలురాసి, ప్రసాదాన్ని ఆరగింపు చేసి, గుమ్మడికాయ దిష్టి తీశారు. ఈఓ కె.సుబ్బారావు, వైదిక పెద్దలు, ఈఈ శ్రీనివాసరాజు టెంకాయలు కొట్టగా రథాన్ని లాగారు. భక్తుల గోవిందనామస్మరణ చేస్తుండగా రథాన్ని మహాద్వారం ఎదురుగా తీసుకువచ్చి మరో మారు హారతిచ్చి సిద్ధం చేశారు.

**అందరి సమన్వయంతో ఉత్సవం: ఈఓ**

అధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ స్వామివారి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ఈఓ కె.సుబ్బారావు తెలిపారు. ఇప్పటికే అన్నిప్రభుత్వ శాఖల సహకారం కోరామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీడ, నీరు, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రథోత్సవం ఇబ్బందులు కలుగకుండా అధికారులు, వైదికులు సూచనలు తీసుకున్నామని చెప్పారు. భక్తులకు రవాణా సౌకర్యం లో భాగంగా కళ్యాణం అనంతరం కూడా బస్సులను సింహగిరింపై అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఈఓ వెల్లడించారు. కాగా విద్యుత్ దీప అలంకరణలతో సింహగిరి శోభిల్లుతోంది.

## 18 వేల మంది విద్యార్థులతో 'మహా సూర్యవందనం'

### అరకులో ప్రపంచ రికార్డు



**అరకు, విశాఖ సమాచారం:** అరకులో 18 వేల మంది విద్యార్థులతో ప్రపంచ రికార్డు సాధించేలా 'మహా సూర్యవందనం' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 వేల మంది విద్యార్థులతో 108 సార్లు సూర్యనమస్కారాలు చేయించారు. అరకులోని గిరిజన సంక్షేమ వసతి గృహం మైదానంలో ఈ మహా సూర్యవందనం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంధ్యా రాణి ప్రారంభించగా.. ఐటీడీఏ, గిరిజన విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నమోదు చేసేందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి ఏలేసా రైనాడ్ వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. "గిరిజన ప్రాంతంలో జరిగిన గొప్ప కార్యక్రమం ఇది. 5 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ మహా సూర్యవందనంలో పాల్గొన్నారు. గిరిజన బిడ్డలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారు అనడానికి ఇదే నిదర్శనం" అని అన్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల నిత్య జీవితంలో ఇది నిరంతర అభ్యాసంగా నిలవాలన్నారు.

# ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం



గొలుగొండ, (విశాఖ సమాచారమ్) - కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025లో ఆర్థిక సంవత్సరంలో గొలుగొండ మండలం పప్పుశెట్టి పాలెం పంచాయతీలో సోమవారం ఉపాధి హామీ పథకం పనులను టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, మాకిరెడ్డి బంగారు బాబు, వీఆర్పీ నూకరాజు, అల్లు స్వామి,వర, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు లేకుండా ప్రతిపక్ష నాయకులకు లబ్ధి చేకూర్చడం దేనికి?



గొలుగొండ, (విశాఖ సమాచారమ్): - మండలం కొత్తమల్లంపేట గ్రామంలో టీడీపీ అధికారంలోకి రావడం కోసం రేయింబవళ్లు జెండా మోసి ఎంతో కష్టపడ్డామని, ఇప్పుడు కూటమి అధికారంలో ఉండగా ప్రతిపక్ష నాయకులకు లబ్ధి చేకూర్చడం ఎంతవరకు సబబు అని టీడీపీ నాయకులు సూరెడ్డి ఎర్రినాయుడు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ 2014- 19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మా గ్రామంలో ప్రతిపక్ష నాయకులకు సుమారు 50 లక్షల రూపాయల వరకు లబ్ది చేకూరేందుకు, మండల నాయకులు సహకరించారా? లేదా? నియోజకవర్గ నాయకులు సహకరించారా? అన్న విషయం తెలియాలన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా సుమారు 17 లక్షల రూపాయల వరకు అదే వ్యక్తి లబ్ధి పొందుతున్నట్లు మా సీనియర్ నాయకులు తెలిపారు. మరి మేము పార్టీ కోసం కష్టపడుతున్నాము, మేము ఎందుకు కనపడలేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా విషయాలపై కార్యకర్తలకు వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

# ఘనంగా మూలకుద్దు సుత్తమ్మతల్లి 15 వ వార్షికోత్సవం



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):- భీమిలి మండలం మూలకుద్దు గ్రామదేవత సుత్తమ్మతల్లి ఆలయం 15వ వార్షికోత్సవం. సోమవారం ఘనంగా నిర్వహించటం జరిగింది. గోస్తని నది తీరంలో నెలకొన్న సుత్తమ్మతల్లి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి పాలభిషేకం, కుంకుమ పూజ భక్తులు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొయ్యి అప్పల రెడ్డి, సర్పంచ్ కొల్లుచిట్టిరామకృష్ణారెడ్డి ,నాగిరెడ్డి, రమణ, కొల్లి గోపీనాథ్, కొయ్యి అప్పల నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేల మంది విచ్చేశారు సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దీపారాధన అర్చకుడు కిరణ్ ఆధ్వర్యంలో కనుల పండుగ గా జరిగింది.

# కేంద్రమంత్రితో ఎమ్మెల్యే భేటీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి గౌరవనీయులు పెమ్మసాని చంద్రశేఖర్‌ని జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అమెరికా లోని డల్లాస్‌లో మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ నగర పరిధిలో అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# యువకుడు దారుణ హత్య



రావికమతం, (విశాఖ సమాచారమ్): - మండలంలోని గర్ణికం గ్రామ సమీపంలోని తిరుమల ఫంక్షన్ హాల్ వద్ద గత రాత్రి మేడివాడ గ్రామానికి చెందిన కొలిపాక పవన్ కుమార్ (23) హత్య గురయ్యాడు. ఈ విషయంపై కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు కథనం మేరకు మేడివాడ గ్రామానికి చెందిన కొలిపాక త్రిమూర్తులు అనే వ్యక్తి తన కుమారుడు పవన్ కుమార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని, ఫోన్ ద్వారా తెలియజేశారు. వెంటనే సంఘటన స్థలానికి రాత్రి ఒంటి గంట సమయంలో వెళ్ళామని దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలన అనంతరం పోస్టుమార్టంకు తరలించామని తెలిపారు. మృతుడు తండ్రి త్రిమూర్తులు విలేకరులతో మాట్లాడుతూ నా కుమారుడుని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గత రాత్రి సెల్ ఫోన్ కొనుక్కుంటానానని కొంత నగదు ఇచ్చానని తెలిపారు. మృత దేహం వద్ద కొంత నగదు కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


## ఈస్ట్ కోస్ట్ రైల్వే

(1) ప్రకటన నెం. eT-West-WAT-12-2025, తేదీ. 03.04.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KK-II లైను పైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/కిరండుల్ వారి పరిధిలో దంతేవారా- కిరండుల్ స్టేషన్ల మధ్యన ఓపెన్ లైను హేండింగ్ ఓవర్‌కు సంబంధించి బ్యాలన్స్ సివిల్ పనులు నిర్వహించుట.

**ప్రకటిత విలువ:** ₹ 2,35,44,545.48, బయానా: ₹ 2,67,700/-.

(2) ప్రకటన నెం. eT-West-WAT-13-2025, తేదీ. 03.04.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KK-II లైను పైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/కిరండుల్ వారి పరిధిలో దంతేవారా- కమలూరు స్టేషన్ల మధ్యన కి.మీ. 402.128-414-481 వరకు రైళ్ళ రవాణా సురక్షితంగా మరియు సజావుగా సాగుట కొరకు ట్రాక్ నిర్వహణకు సంబంధించి వదిలిపెట్టిన (మిగిలిన) పి.వే పనులు నిర్వహించుట అనగా షాలో స్క్రీనింగ్, లిఫ్టింగ్, ప్యాకింగ్, డి-స్ట్రెసింగ్, వెల్డింగ్ మరియు ఇతర పనులు.

**ప్రకటిత విలువ:** ₹ 64,54,359.70, బయానా: ₹ 1,29,100/-.

(3) ప్రకటన నెం. eT-West-WAT-14-2025, తేదీ. 03.04.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KK-II లైను పైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/జగదల్‌పూర్ వారి పరిధిలో కాంట్రాక్టరు వారి గట్టి రాళ్ళను మెకనైజ్డ్ క్రషర్ ఉపయోగించి 50MM సైజు గేజీలో 18,000 ఘ.మీ రైల్వే స్పెసిఫికేషన్ ప్రకారం క్రషింగ్ చేయుట, వాటిని చారుముల కుసిమి డిపో యొక్క గుర్తించిన ప్రదేశమునకు రవాణాచేయుట, అన్‌లోడింగ్ మరియు గ్రౌండ్ స్థాయిలో గుట్టగ పేర్చుట గ్రౌండ్ డ్రెస్సింగ్‌తోపాటు మరియు వాటిని చారుములకుసిమి డిపో వద్ద ఏరకమైన రైల్వే వ్యాగన్లులోని కైనా కాన్ట్రక్టర్ వారి స్వంత లోడింగ్ ఏర్పాట్లుతో లోడింగ్ చేయుట.

**ప్రకటిత విలువ:** ₹ 2,86,77,600/-, బయానా: ₹ 2,93,400/-.

(4) ప్రకటన నెం. eT-West-WAT-15-2025, తేదీ. 03.04.2025

**పని పేరు:** సీనియర్ డివిజనల్ ఇంజనీరు (వెస్ట్), ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ వారి పరిధిలో జగదల్‌పూర్ రైల్వే స్టేషన్ వద్ద వాటరు రీసైక్లింగ్ ప్లాంట్ (సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్).

**ప్రకటిత విలువ:** ₹ 1,03,79,179.85, బయానా: ₹ 2,01,900/-.

పని పూర్తి చేయు కాలం: 12 నెలలు (ప్ర.నెం.1, 2 & 4 కొరకు) & 08 నెలలు (ప్ర.నెం. 3 కొరకు)

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 25.04.2025న 1500 గంటలకు (అన్ని టెండర్లు కొరకు).

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏవైనా మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు

PR-12/Q/25-26


# దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని విశాఖ నగరపోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చి ఆకాంక్షించారు. ఆదివారం రాత్రి పౌరగ్రంథాలయంలో కళావేదిక కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ నందూరి రామకృష్ణ విరచిత రచించిన సామాజిక నిత్య హితోక్తులు పుస్తకావిష్కరణ సభలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఇతరులకు తమ పరిధి మేరకు సహాయం అందించాలన్నారు. అటువంటప్పుడే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నగరంలో తాను పర్యటించేటప్పుడు అనేక మంది పేదలు, ఇతరులు సమస్యలను గుర్తిస్తున్నామని వారికి తాము చేయాల్సిన మేరకు సహాయం చేస్తున్నట్లు చెప్పారు. అయితే అన్ని సమస్యలను ఏ ఒక్కరూ పరిష్కరించలేరన్నారు. కాబట్టి కష్టాల్లో ఉన్న వారికి చేదోడుగా ఉండేందుకు ప్రత్యేక ఫ్లాట్ ఫాం రూపొందించాలని అందులో సాయం చేసేటప్పుడు పోలీసు విభాగం తరుపున తాము అర్హులను ఎంపిక చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతా యుతంగా ముందుకు సాగితే సమాజంలో అందరికి మెరుగైన ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత నందూరి రామకృష్ణను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ పుస్తకంలో సమాజంలో జరుగుతున్న అన్ని సంఘటనలను రచయిత పేర్కొన్నారన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షులు, సంఘ సేవకులు కమల్ బెయిడ్ మాట్లాడుతూ తాను నిరంతరం ఎంతో మంది క్రీడాకారులకు, నిరుపేదలకు తన వంతు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెప్పారు. అయితే అందరికి తాను ఒక్కడినే చేయాలంటే కష్టమని మిగిలిన వారు కూడా చేయూతనం దించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కరాటే క్రీడాకారులకు, వెటరన్ క్రీడాకారులకు సీపీ చేతులు మీదుగా కమల్ బెయిడ్ ఆర్థిక సహాయం అందజేశారు. పుస్తక రచయిత నందూరి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు మూడు పుస్తకాలు రచించడం జరిగిందన్నారు. అందులో ప్రత్యక్షంగా పరోక్షంగా జరుగుతున్న సంఘటనలే పొందుపరచడం జరుగుతుందన్నారు. తమ సంస్థ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. వినియోగదారుల ఫోరం -1 అధ్యక్షులు తనూజా రెడ్డి మాట్లాడుతూ వినియోగ దారులు సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఇదే సమ యంలో సంఘ సేవకలను ప్రోత్సహి స్తున్నామన్నారు. ప్రజలు ఎటువంటి సమస్య ఎదుర్కొన్నప్పటికి వాటికి సంబంధించిన బిల్లులు ఉంటే తప్పకుండా వారికి న్యాయం చేస్తామన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అధ్యాపకులు సుబ్బా రావులు మాట్లాడుతూ నందూరి , కమల్ బెయిడ్ లు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమన్నారు. ప్రతి ఒక్కరు సమాజ సేవకు అంకితం కావాలని అప్పుడే పేదరి కం తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులను అతిథులు చేతులు మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రజని, సీనియర్ పాత్రికేయులు కె.వి.శర్మ, జగన్ మోహన్ తదితరులంతా పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం దృష్టికి గిరిజనుల సమస్యలు



అరకులోయ (విశాఖ సమాచారమ్): అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అరకు నియోజక వర్గం, డుంబ్రిగూడ మండలానికి విచ్చేసిన తరుణంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో గలబి రోడ్లు, బ్రిడ్జిలు సమస్యల గురించి వివరించి నిధులను మంజూరు చేయవలసిందిగా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంతో మాట్లాడుతూ అరకు నియోజకవర్గం నుండి పాడేరు నియోజక వర్గం కలుపు మార్గమైన బోసరి గడ్డపై గల వంతెన నిర్మాణం అత్యవసరమని, వంతెన లేక ఎన్నోఏళ్ల నుంచి పలువురు గిరిజనులు నీటి మునిగి కొట్టుకుపోయి తమ ప్రాణాలు కోల్పోవడం జరిగిందని తెలిపారు. ముంచంగిపుట్టు మండలం, జర్జుల పంచాయతీ, జర్జుల పీఆర్ రోడ్డు నుండి అంబపాడ వరకు నూతన రోడ్డుతో పాటు బీటీ రోడ్డు, హుకుంపేట మండలం, హుకుంపేట గ్రామం నుండి చీడిపుట్టు వెళ్లే మార్గంలో గల వంతెన నిర్మాణం, ముంచంగిపుట్టు మండలం, కర్రి ముక్కుపుట్టు పంచాయతి, కర్రి ముక్కుపోటు పీఆర్ రోడ్డు నుండి రోర్ల పుట్టు గ్రామం వరకు నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం ముంచంగిపుట్టు మండలం, జర్జుల పంచాయతీ టంకపుట్టు నుండి కడెం బీరు మార్గంలో గల నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం, ముంచంగిపుట్టు మండలం బుంగ పుట్టి పంచాయతీ బుంగపుట్టు పీఆర్ రోడ్డు నుండి రంగని గూడ మీదుగా ఏడుకొండల బంధ వరకు నూతన బీటీ రోడ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో పూర్తిగా వైఫల్యం

## - మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):- ఇటీవల మధురవాడ 5వ వార్డు ప్రేమ ఉన్మాది కేసులో దీపిక అనే యువతీ ప్రాణాపాయ స్థితిలో విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని తెలిసి ఆస్పత్రికి వెళ్లి దీపిక, వారి కుటుంబ సభ్యులను విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు( చిన్న శ్రీను) పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల క్షీణతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# ఆప్కాస్ లోనే కొనసాగించాలని నిరసన

మంగళగిరి రూరల్ : రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ లో ఉన్న ఫిబ్రవరి, మార్చి నెల ల జీతాన్ని వెంటనే ఏజెన్సీ, సి ఆర్ డి ఏ అధికారులు చెల్లించాలని, ఆప్కాస్ నీ కొనసాగించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నవులూరు, ఎర్రబాలెంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. నిరసనలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి పాల్గొని మాట్లాడారు. రాజధాని పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దు అంటూ నిరసన తెలిపారు. రాజధాని పారిశుధ్య కార్మికులకు పెండింగ్ ఉన్న ఫిబ్రవరి, మార్చి నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజధాని పారిశుద్ధ్య కార్మికుల ఆందోళనకు మద్దతుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం నిరసనలు పిలుపు నేపథ్యంలో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు.

ఎంటిఎంసీలోని నవులూరు, ఎర్రబాలెం మున్సిపల్ కార్మికుల నిరసనలో రవి పాల్గొని మాట్లాడుతూ..రాజధానిలో పారిశుధ్య కార్మికులకు మూడోనెల గడుస్తున్న జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం ఆలస్యం చేయడం పై ప్రశ్నించారు. కార్మికుల ఆకలి కేకలను పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుళ్లూరు సి ఆర్ డి ఏ కార్యాలయం వద్ద పలుమార్లు కార్మికులు ఆందోళన చేసిన అధికార యంత్రాంగం ఏమాత్రం స్పందించడం లేదని, ఇది సిగ్గు చేటన్నారు. జీతాలు సక్రమంగా చెల్లించకపోగా పారిశుధ్య కార్మికులతో గాడిద చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. రాష్ట్రమంతా పారిశుధ్య కార్మికులకు 21 వేల రూపాయలు జీతం చెల్లిస్తూ.. రాజధాని పారిశుధ్య కార్మికులకు మాత్రం కేవలం 12 వేల రూపాయల జీతంతో సరిపెడుతూన్నారని చెప్పారు. ఏ నెల కా నెల సక్రమంగా చెల్లించకుండా మూడో నెల జరుగుతున్న నేటికి కార్మికుల జీతాలు చెల్లించకపోవడం అన్యాయం అని అన్నారు. ఏజెన్సీ సిఆర్డి ఏ అధికారులు ఇదే విధంగా రాజధాని పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే విజయవాడలో కార్మికుల కుటుంబాలతో భిక్షాటన చేపడతామని రవి హెచ్చరించారు. తక్షణం కార్మికుల జీతాలు చెల్లించాలని రవి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను ఆప్కాసులోనే కొనసాగించాలని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దని అన్నారు. ఆప్కాస్ ను తొలగించి ప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికుల ను అప్పగిస్తే పని భద్రత లేకుండా పోతుందని అన్నారు. మున్సిపల్ కార్మికులను ఆప్కాసులోనే కొనసాగించాలని కోరుతూ మున్సిపల్ మంత్రి వద్దకు రాయబారాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓ రామారావు, టీ ఆదిలక్ష్మి, ఏడుకొండలు, శివకోటి, మేరీ, నాగమణి, శివ నాగేంద్రం, రజిని, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ హనుమాన్ ధ్వజం పంపిణీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- నగరంలోని మత్స్యకార గ్రామమైన జోడుగుళ్ళపాలెంలో శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకుని రామభక్తులు ఇంటింటికీ హనుమాన్ ధ్వజం పంపిణీ చేశారు. శ్రీరామ సేవా సమితి(విశాఖ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, స్థానికులు పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ యోగచంద్ర వివేక్ మాట్లాడుతూ నేటి యువత పాశ్చాత్య నాగరికతకు లోనై భారతదేశ సనాతన ధర్మానికి దూరమవుతోందన్నారు. ఫలితంగా జీవితం, కుటుంబ వ్యవస్థ అవస్థల పాలవుతోందని, వ్యక్తి ప్రవర్తన, జీవితం గొప్పగా ఉండాలంటే ఆధ్యాత్మిక మార్గమే శరణ్యమన్నారు. ఈ దృష్ట్యా యువత, సమాజంలో భక్తిభావం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. స్థానికుల నుంచి మంచి స్పందన లభించిందని, ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి, ధ్వజాలు స్వీకరించి, తమ ఇళ్ళపై కట్టారని చెప్పారు. స్థానిక భక్తురాలు సుజాతరాజు, మహిళలతోపాటు రామభక్తులు లక్ష్మణ్, ఎల్లాజీ, అచ్యుతరావు, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు వరాహ లక్ష్మీ నృసింహ స్వామి తిరు కల్యాణ మహోత్సవం

అనకాపల్లి ( విశాఖ సమాచారమ్) : పట్టణంలో గవరపాలెం దిబ్బ వీధిలో వేంచేసిన వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు మల్ల రామచంద్రరావు తెలిపారు. ఆలయ ముఖ్య ప్రోత్సాహకుడు దాడి రత్నాకర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుండి ఉత్సవ మూర్తులకు పంచామృతములతో అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ప్రోత్సాహంతో స్వామివారి రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహిస్తారన్నారు. 30న సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం వైభవంగా జరుగుతుందన్నారు. తెల్లవారుజాము రెండు గంటలకు, స్వామి వారి మేలుకొలుపు రెండున్నర గంటలకు స్వామివారి చందనం ఒలుపు నాలుగు గంటలకు స్వామి వారి నిజ రూప దర్శనం ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు సహస్ర ఘటాభిషేకం పూజా కార్యక్రమం జరుగుతుందని 1,008 ఘటాలతో భక్తులచే రాత్రి 7 గంటల నుండి స్వామివారికి అభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా రామచంద్రరావు కోరారు.

# స్మశాన వాటికకు భూమి పూజ



గొలుగొండ (విశాఖ సమాచారమ్): మండలంలోని చోద్యం గ్రామంలో స్మశాన వాటిక నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ ఆదపరెడ్డి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ పనులకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. భూమి పూజ కార్యక్రమంలో టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు దేవాడ శేషు, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ(బాబ్జీ), టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడిగర్ల స్వామి నాయుడు, సీనియర్ నాయకులు కారుకురోలు ధర్మరాజు, మాకిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ బీసీ సెల్ రాష్ట్ర డైరెక్టర్ బొందల రాజబాబు, పంచాయతీ కార్యదర్శి సాధనాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత పట్టని కూటమి ప్రభుత్వం

## వైసీపీ నేత హరి కిరణ్‌రెడ్డి



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):- ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన పది నెలల కాలంలో ఆడబిడ్డలు మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వైసీపీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ముఖ్యంగా చదువుతున్న విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు అఘాయత్యానికి పాల్పడిన సంఘటనలు నుంచి మన విశాఖ జిల్లా మధురవాడలో ప్రియురాలు తల్లిని చంపిన ప్రేమ ఉన్మాదులు,విజయనగరం జిల్లాలో 12 ఏళ్ల బాలికను కత్తితో పొడిచిన అటువంటి సంఘటనలు ఎన్ని జరిగినప్పటికీ కనీసం చీమ కుట్టినట్టుగా వ్యవహరించకపోవడం కూటమి ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం అని తెలిపారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 5 అర్జీలు

భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):- జోన్-1జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు 5 అర్జీలు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 3, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 1, యూసీడీ విభాగానికి సంబంధించి 1 అర్జీ వచ్చింది.

విశాఖ సమాచారమ్

మంగళవారం 8-4-2025

# బీజేపీ మరో విజయం

బీజేపీ,ఆర్ఎస్ఎస్ లు తమ అజెండాలోని మరో మైలురాయి దాటాయి.పార్లమెంట్లో వక్ఫ్ సవరణ బిల్లు సునాయాసంగా ఆమోదం పొందింది. రాష్ట్రపతి కూడా ఆమోదముద్ర వేయడంతో ఇక చట్టం అమలులోకి వచ్చినట్టే. వక్ఫ్ వ్యవస్థ లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించడం వల్లే వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చామని స్వయంగా ప్రధాని మోదీ ప్రకటించడం విశేషం.ఇదోక కీలక పరిణామమని,ఈ బిల్లు ఆమోదంతో సామాన్య ముస్లింలకు మేలు చేకూరుతుందన్నారు. ఎంతో కాలంగా అట్టడుగున ఉన్న ప్రజలకు ఎంతగానో సహాయపడుతుంది నడుం గమనార్హం.కాంగ్రెస్,ఇతర ప్రతిపక్షాలు,ముస్లిం వర్గాల నిరసనల మధ్య పార్లమెంట్ ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందింది.లోక్ సభలో 288-232గా, రాజ్యసభలో 128-95 గా ఓట్లు వచ్చాయి.ఉభయసభల్లోనూ విస్తృతంగా చర్చ జరిగింది. లోక్ సభలో 14 గంటలు,రాజ్యసభలో 12గంటలు చర్చలు భీకరంగా జరిగాయి.చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు. బిల్లులోని లోపాలను ఎత్తి చూపాయి. ముస్సల్మాన్ వక్ఫ్ చట్టం1923 రద్దయి కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఈ చట్టంతో వక్ఫ్ బోర్డు లు వాటి వాస్తవ విలువను నిర్ధారించుకోవడానికి కలెక్టర్లతో తమ ఆస్తులను నమోదు చేసుకోవాలి.దేశంలో 30 వక్ఫ్ బోర్డులున్నాయి.9.4 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్న 8.7లక్షల ఆస్తులు వక్ఫ్ బోర్డులో నియంత్రణలో ఉన్నాయి.వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ఒక ఆస్తి వక్ఫ్ ఆస్తా కాదా అని నిర్ణయించే అధికారం ఇస్తుంది.వక్ఫ్ ట్రిబ్యునల్ దానిని రద్దు చేయకపోతే బోర్డు నిర్ణయం అంతిమంగా. ఉంటుంది.వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారం కొత్త చట్టం కలెక్టర్లకు వర్తించేలా చేస్తుంది.నిర్ణయం వచ్చేవరకూ వివాదస్పద ఆస్తి ప్రభుత్వ ఆస్తిగా పరిగణిస్తారు. ఈ బిల్లు మేరకు వక్ఫ్ కౌన్సిల్ లో22మందిలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండవచ్చు.రాష్ట్ర వక్ఫ్ బోర్డు లో 11 మంది సభ్యుల్లో ఇద్దరు ముస్లిమేతరలు ఉండవచ్చు.రూ.లక్ష కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వక్ఫ్ సంస్థలు ఆడిట్ చేయించాలి.ముస్లిం మతం కనీసం ఐదేళ్లు పాటించేవారు తమ ఆస్తిని వక్ఫ్ కు ఇవ్వవచ్చు.వక్ఫ్ ప్రకటనకు ముందే మహిళలు తమ వారసత్వం పొందాలని,విడాకులు తీసుకున్న మహిళలు, వితంతువులు, అనాధలకు ప్రత్యేక నిబంధనలు ఈ బిల్లు నిర్దేసిస్తుంది. ఈ బిల్లు ముస్లింలకే లాభమని,ముస్లీమేతరులు జోక్యం చేసుకోలేరని కేంద్రమైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పడం విశేషం.

ప్రధాని మోదీ విదేశీ పర్యటన లో బిజీగా ఉండగా హెూంమంత్రి అమిత్ షా 12 గంటలపాటు ఉభయ సభల్లో ఉండి ప్రణాళిక ప్రకారం బిల్లు ఆమోదం జరిగేలా చూడడం. ఇది షా స్కెచ్ కు తాజా ఉదాహరణ.ఎన్డీఏ సభ్యులతో పాటు ఇతర పార్టీ ఎంపీలు మద్దతు కూడగట్టడం, బీజేడీ సభ్యులను దారికి తెచ్చుకోవడం షా వ్యూహానికి మచ్చుతునక. ఈ బిల్లుకు అనుకూలంగా బీజేపీ, టిడీపీ, జేడీయూ, ఏఐఏడిఎంకే, బీజేడీ, ఇతర ఎన్డీఏ పక్షాలు ఓట్లు వేసాయి.91ఏళ్ల వయస్సు లో దేవెగౌడ సభలో చురుకుగా,ఉత్సాహంగా పాల్గొనడం ఇతర సభ్యులకు ప్రేరణ కావాలని పలువురు ఎంపీలు ప్రశంసించారు. ఈ బిల్లు వల్ల ఎన్డీఏ మిత్ర పక్షం జేడీయూకు షాక్ తగిలింది.నితీష్ బిల్లుకు మద్దతు తెలపడంతో ఇద్దరు సీనియర్ ముస్లిం నేతలు మహమ్మద్ ఖాసీం,నవాజ్ మాలిక్ లు రాజీనామా చేసారు.

ఈ బిల్లుకు వ్యతిరేకంగా చెన్నై,కోయంబత్తూరులో టీవికే కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేసారు.ఈ బిల్లు ద్వారా వక్ఫ్ భూముల సర్వే అధికారాలు కలెక్టర్ లకుబదలాఅవుతాయని, ఫలితంగా భూ ఆక్రమణలకు అవకాశాలు పెరుగుతాయని ముస్లిం నేతలు ఆరోపిస్తున్నారు.

ఇదిలావుండగా వక్ఫ్ సవరణ బిల్లు 2025పై తాజాగా కాంగ్రెస్, ఎంఐఎం సుప్రీంకోర్టు ను ఆశ్రయించాయి.కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్,ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోర్టులో పిటిషన్ వేసారు.ఈ బిల్లుపై రాజ్యాంగ చెల్లుబాటు అంశాన్ని సవాల్ చేసారు.ముస్లింసమాజ ప్రాధమిక హక్కులు ఉల్లంఘించే లా ఉన్నాయని పిటిషన్ లో పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా జగన్ నేతృత్వంలోని వైసీపీ వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకించి సంచలనం రేపింది.రాష్ట్రంలో మైనార్టీలకు కలుపుకుని టీడీపీ,జనసేనలను దెబ్బకొట్టేందుకే ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు.

మంగళవారం 8-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం

పంచాంగం

| | |
|---|---|
| తిథి | : శు. ఏకాదశి సా. 9.13 |
| నక్షత్రం | : ఆశ్లేష ఉ. 7.55 |
| వర్జ్యం | : రా. 8.56 ల 10.40 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# ఆనాటి మధురానుభూతులు మళ్లీ వస్తాయా...



ప్రతి వారికీ పుట్టిన ఊరు గురించి ఎన్నో మధుర స్మృతులు ఉంటాయి.పెద్దవారై ఉద్యోగం రీత్యా దేశ విదేశాలు తిరిగినా జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపి గరీయసి"అంటే తల్లి,మాతృభూమి స్వర్గం కంటే శ్రేష్టమైనవి అని అర్థం.ఈ పల్లవితో సినీ కవులు పాటలు రాసారు.ఆ పాట వింటున్నప్పుడు ప్రతి వ్యక్తి కి రోమాంచిత మవుతుంది.కళ్ళనుంచి నీరు వస్తుంది.ఒక తీయని గగుర్పాటు కలుగుతుంది. చిన్నతనంలో తాము గడిపిన రోజులు,ఆనాటి స్నేహితులు గుర్తుకు వస్తారు.అలా జీవన యానంలో అనుభవాలు మస్తిష్కంలో పదిలంగా ఉంటాయి.వాటిని అప్పుడప్పుడు తలచుకుంటే నిజంగా వచ్చే ఆనందం చెప్పనలవికాదు.చిన్ననాటి స్నేహితులు కలిసినా, సొంత ఊరు వెళ్లినా గుర్తు చేసుకుంటే ఎంతో టెన్షన్ తో ఉన్న జీవితం హాయిగా ఉంటుంది.కాని ఈ నాటి తరం ఈ అనుభవాలు కోల్పోతున్నారని దిగులు కలుగుతుంది.

కేవలం 5060 ఏళ్లలో మనిషి జీవన విధానం ఎంతగా మారిపోయింది. స్కూలుకు వెళ్లేప్పుడు 5 పైసల పాల ఐస్ చీకుతూ వెళ్లడం మర్చిపోలేం. సాయంత్రం పాఠశాలలో కబడ్డీ,కోకో ఆటలు ఆడుకోవడం గుర్తుకు వస్తాయి. తమ్ముడు,చెల్లితో కలిసి మామిడి, జామకాయలు కాకి ఎంగిలితో తినడం మధుర స్మృతి. అట్లతద్ది, ఉండ్రాళ్ల తద్ది రోజున తెల్లవారు జామున లేచి వేడివేడి అన్నం, పెరుగుతో తిని, కొత్త బట్టలు వేసుకుని ఉయ్యాల ఊగడం మర్చిపోతామా. రేడియోలో నాటిక ప్రతి బుధవారం, ఆదివారం మధ్యాహ్నం సినిమా వచ్చేది.వాటికోసం కాచుకుని కూర్చునేవారు. ఉదయం భక్తి ముక్తావళి,ఢిల్లీ వార్తలు, సంస్కృత పాఠం, సంగీతం పాఠం ఎనిమిది గంటలకు వార్తలు వచ్చేవి. సాయంత్రం సిలోన్ నుంచి మీనాక్షీపొన్నుదొరై అనౌన్సర్ గా తెలుగు పాటలు వచ్చేవి. వివిధ భారతిలో హిందీ పాటలు వచ్చేవి. మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమం,శని ఆదివారాలు పిల్లలు కార్యక్రమాలు అలరించేవి.ఉషశ్రీ భారతం అన్నం తింటూ ఆదివారం వింటుంటే అదొక ఆనందం.

సంక్రాంతి సెలవలకు అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్లినప్పుడు వరి కోతలు,కుప్పలు అయినాక తాతతో పాటు పొలం వెళ్ళి పరిక ఏరుకుని వచ్చిన ధాన్యం చిల్లరకొట్టు లో ఇచ్చి జిలేబీ,చక్కిడాలు తిన్న రోజులు తళుక్కున మెరుస్తాయి.భోగి మంటలు చుట్టూ తాత చెప్పిన రామనామం పాడుతూ తిరగడం, సంక్రాంతి రోజు కోడి పందెం లకు వెళ్ళడం,పుంజులు పోట్లాడుకున్నప్పుడు పల్నాటి యుద్ధం గుర్తుకు రావడం,కనుమ రోజు పశువులను చెరువులో కడిగి కొమ్ములకు రంగులు వేయడం మదిలో చెరగని స్మృతులు. కచ్చికలు,వేపు పుల్లలతో ముఖం ప్రక్షాళనం చేసుకునేవారం.నులక మంచాల పై పడుకునే వారం.

స్కూలుకు వెళ్ళడానికి సిటీ బస్సు చార్జీలు రోజుకు15 పైసలు నాన్న ఇస్తే నడిచి వెళ్ళి దాచుకుని మధ్యాహ్నం స్కూలు ఎగ్గొట్టి కీలుగుర్రం సినిమా నేలటిక్కెటు (40పైసలు) కొనుక్కుని మాట్నీ చూడడం. అదేరోజు ఇంటికి రాగానే అమ్మ,చెల్లెళ్లు సినిమాకు రెడీ అవడం..తొందరగా రెడీ కమ్మని అమ్మ ఆదేశం..చివరకు అదే కీలు గుర్రం సినిమాకు వెళ్లడం..తేలుకుట్టిన దొంగ లాగా మళ్లీచూడడం తలచుకుంటే మనసులో తీయని అనుభూతి.పొట్టు పొయ్యి మీద వేడినీళ్లు,కుంపటి మీద వంటలు చేసేవారు.కుంపటి మీద వండిన దోరగా అట్టు లాగా కట్టిన దిబ్బ రొట్టె రుచి తలచుకుంటే ఇప్పటికీ నోరు ఊరుతుంది.ప్రతి ఇంట్లో గిలక బావి ఉండేది.నూతి చుట్టూ సిమెంట్ చప్టా ఉండేది. పిల్లలు అక్కడే ఆరు బయట స్నానం చేసేవారు.ఉదయం పిల్లలకు పాలు ఇచ్చేవారు.9 గంటలకల్లా భోజనం,స్కూలు మధ్యాహ్నం మళ్లీ భోజనం,సాయంత్రం రాగానే మరమరాలు,శనగపప్పు పెట్టేవారు.ఎవన్నా తిను బండారాలు ఉంటే పెట్టేవారు.రాత్రి ఏడున్నర కల్లా భోజనం.టిఫన్లు లేవు.శనివారం రోజు పెద్దవారు ఉపోషం ఉంటే బియ్యపు రవ్వతో పిండి చేసేవారు.ఆదివారం అందరూ ఇంట్లో ఉంటే మధ్యాహ్నం ఉప్మా చేసేవారు.వాటికోసం పిల్లలు ఎగబడేవారు.

వేసవి సెలవలకు బామ్మ తాతయ్య వాళ్ల ఊరి వెళ్లినప్పుడు మంజకాయల విందు,ఆవకాయ ముక్కతో పసందు.తిన్న ముంజకాయలతో బండి చేసుకుని తిప్పడం,తాటి ఆకులతో బొమ్మలు,చేతి గడియారాలు చేసుకోవడం, ఈత కాయల కోసం పొలాల గట్ల వెంబడి తిరగడం,తాతయ్య గ్రంథాలయం నుంచి చందమామ,బాలమిత్ర పుస్తకాలు చదవడం,రాత్రి ' 'అనగనగా ఒక రాజు'కథలు పరస్పరం చెప్పుకోవడం యాదికొస్తే అంతులేని ఆనందం.సంక్రాంతికి తాతయ్య మమ్మల్ని బట్టలు షాపుకు తీసుకు వెళ్లి బట్టలు కొనడం,అప్పుడు బామ్మకూ కొనమని రికమెండేషన్ గుర్తుకువస్తాయి. రెండెడ్ల బండీమీదస్వారీ,బియ్యం పట్టే మిల్లుచూడడం, నూతిలోంచి నీరు తోడడం, ఆవులు, గేదెలు, ఎద్దులు, దూడలు ఇవన్నీ గుర్తుకు వస్తాయి.ఆవు ఈనడం,వెంటనే ఆ దూడ గంతులు వేయడం ,బుజ్జి దూడ గంతులు వేస్తుంటే దాని మెడలో గంటలు ఘల్లు ఘల్లు మనడం మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఎండాకాలం అన్నయ్య తో కలిసి స్తంభం చెరువులో ఈత కొట్టడం,కలవ పూలు తేవడం,గోలీలాట,కర్రబిళ్లలాట,కోతికొమ్మచ్చి ఆటలు గుర్తుకు వస్తాయి.

సైకిల్ అద్దెకు తెచ్చుకుని నేర్చుకోవడం,క్రింద పడడం,పక్క తొక్కుడు తో మొదలై సీటు మీద కూర్చుని తొక్కడం నేర్చుకోవడం,ముసలమ్మ లను గుద్దడం,వాళ్లు 'నీ జిమ్మడా,కళ్లు కనిపించడం లేదా'అని తిట్టడం గుర్తుకు వస్తే నవ్వు వస్తుంది.కొంచంపెద్ద అయిన తరువాత డిటెక్టివ్ నవలలు చదవడం,వాటిలోని సాహసకృత్యాలు తలచుకుని మనమూ చేయ్యాలని ఆలోచించడం మర్చిపోలేం. కోట సచ్చిదానంద శాస్త్రి హరికథలు, చింతామణి,శ్రీకృష్ణ రాయబారం,సత్య హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, శ్రీ రామాంజనేయ యుద్ధం వంటి నాటకాలకు వేళ్లేవారం. బామ్మ కట్టెల పొయ్యి మీద చేసిన గట్టి పూరీలు,కారప్పూస తలచుకుంటే నోరూరుతుంది.

సినిమా రిలీజ్ అయిన మొదటిరోజు వెళితే ఇదొక సాహసకార్యంగా భావించేవారం. సినిమా పాటల పుస్తకాలు కొనుక్కుని ఆ పాటలను బట్టే పట్టేవారం. ఇంగ్లీషు బాగా రావాలంటే ఎక్స్ ప్రెస్ పేపర్ కొనుక్కుని చదవడం, దూరదర్శన్ ఇంగ్లీష్ వార్తలు వినడం.ఇంటర్ చదువుతున్నప్పుడు మనోజ్ కుమార్ "పూరబ్ ఔర్ పశ్చిమ్" దేశభక్తి సినిమా చూడడం.టీనేజ్ లో ప్రేమ కథాంశంతో తీసిన సినిమాలు చూడడం,అదీ హిందీ సినిమాలు ఆరోజుల్లో బాబీ,యాదోంకీ బారాత్,పాకీజా వంటివి తీయని అనుభూతిని ఇచ్చాయి.ప్రతి మంగళవారం బినాకాగీత్ మాలా లో ఆ పాటలు వినడం.ఆదివారం ఉదయం వచ్చే హిందీ పాటల్లో షమ్మీ కపూర్ పాటలు,రాజేష్ ఖన్నా సినిమాలోని పాటలు వింటుంటే ఎక్కడో విహరించినట్లు ఉంటుంది.నౌషద్ ,ముఖేష్ ,రఫీ,కిషోర్ కుమార్ హిందీ పాటలు,ఘంటశాల పుష్ప విలాపం,దేశభక్తి గీతాలు ఎంతటి శ్రమనైనా మురిపించేవి. పల్లెల్లో రెండూ మూడు చిల్లర దుకాణాలు ఉండేవి.అక్కడ నుంచి రైతులు,కూలీలు ఏరోజు సరుకులు ఆరోజు కొనుక్కునే వారు.ఎదైనా తీసుకు రమ్మని చిల్లరకొట్టు కు పంపితే అవి తీసుకుని వచ్చేప్పుడు పిల్లలం చేయి చాచేవారం.అప్పుడు షావుకారు బెల్లం ముక్క గాని,సెనగపప్పు గాని పెట్టేవాడు.అవి తింటూ ఇంటికి వచ్చేవారు.సైకిల్లో పిల్లలు తిరిగినా కుటుంబం రిక్షాలలో తిరిగేవారు. పట్టణాల్లో శ్రీరామనవమి వస్తే ఊరంతా పందిళ్లు చేసేవారు.ప్రతి సందులో కల్యాణం చేసేవారు.పిల్లలం మేము ఇత్తడి గ్లాసు పట్టుకుని అన్ని పందిళ్లు లోనూ పానకం పోయించుకుని తాగేవారం. శ్రీరామనవమి ఉత్సవాల్లో తోలుబొమ్మలాట,హరికథలు,నాటకాలు వేసేవారు. ఇలా చెప్పుకుంటూ పోతే చిన్ననాటి గుర్తులు,అనుభవాలు, జ్ఞాపకాలు ఎన్నో ఎన్నెన్నో.అవన్నీ మధుర స్మృతులుగా మిగిలిపోయాయి. ఈ తరం వారు దూరం అవుతున్నారని బాధ మరోపక్క కలుగుతున్నది.

-యం.వి.రామారావు, ప్రత్యేక ప్రతినిధి

# హిందీ పాటలో తెలుగు పల్లవి!

## రాజకపూర్ 'శ్రీ 420' సినిమాలో 'రామయ్యా వస్తావయ్యా' పాట వెనుక కథ




రాజ్ కపూర్ 1955లో నిర్మించిన మ్యూజికల్ బ్లాక్ బస్టర్ 'శ్రీ 420'లో శంకర్ జైకిషన్ స్వరపరచిన మహాద్భుతమైన పాటల్లోని ""రామయ్యా వస్తావయ్యా, మైనే దిల్ తుఝ్ కో దియా" అనే పాటను యూట్యూబ్ మాధ్యమంలో చూస్తూ నేను ఆనందిస్తూ వుంటాను. ఇప్పుడు ఆ పాటను మా గురూజీ శ్రీ ములుకుట్ల దత్తాత్రేయ గారు మా సాహిత్య సంగీత సమాఖ్య సమూహంలో సంధించి గుర్తు చేసినందుకు అభినందిస్తూ, ఆ పాట వెనుక కథ మీకు కూడా తెలియజేయాలని ఈ వ్యాసానికి ఉపక్రమించాను. మనలో అందరికీ ఈ పాట గురించి తెలిసినా, ఆ పాట నేపథ్యం తెలిసివుండకపోవచ్చు. రాజ్ కపూర్ వంటి లీడింగ్ హీరో %ఱ% దర్శక, నిర్మాత ఈ పాట పల్లవిలో తెలుగు మాటలు ఎందుకు పెట్టించారో... పైగా ఆ పాటను తెలుగు మాటల పల్లవితోనే ప్రారంభించేందుకు ఎందుకు సాహసించారో అనే విషయం మీద నా ఈ చిన్నప్రయత్నమిది.

1953 లో రాజ్ కపూర్ దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరిస్తూ హీ రోగా నటించిన 'ఆహ్' చిత్రాన్ని 'ప్రేమలేఖలు' పేరుతో తెలుగులోకి డబ్ (ఒకరకంగా పునర్నిర్మించడం) చెయ్యడం అతనికి తెలుగు బాష అంటే ఎంతో గౌరవమని, ముఖ్యంగా సంగీత దర్శకుడు శంకర్ అంటే ప్రత్యేక గౌరవం అనే విషయాన్ని మీకు గుర్తు చేయాలి. అందుచేతనే తన తండ్రి నెలకొల్పిన 'పృథ్వి థియేటర్స్' లో మ్యూజిక్ విభాగానికి సారథిగా వున్న పదహారణాల తెలుగు బిడ్డ శంకర్ ను 'బర్సాత్' (1949) చిత్రం ద్వారా తన సంస్థకు ఆస్థాన సంగీత దర్శకుడిగా నియమించాడు. అలాగే శంకర్ సిఫారసు మీద జైకిషన్ ను కూడా శంకర్ కు జంటగా పనిచేసేందుకు ఒప్పుకున్నాడు.

కట్ చేస్తే... రాజ్ కపూర్ చిత్రాలలో శైలేంద్ర, హస్రత్ జైపురి పాటలు రాసేవారు. రాజ్ కపూర్ కు మన్నా దే (డే అనకూడదు), ముఖేష్ పాటలు పాడేవారు. శంకర్, జైకిషన్, శైలేంద్ర, హస్రత్ జైపురి వీరు నలుగురిది ఒక టీమ్. 'బూట్ పాలీష్' చిత్రం తర్వాత 1955 లో రాజ్ కపూర్ 'శ్రీ 420' చిత్రాన్ని ప్లాన్ చేశారు. 1951లో రాజ్ కపూర్ నిర్మించిన 'ఆవారా' చిత్రం నుంచి మ్యూజిక్ సిట్టింగుల కోసం శంకర్, జైకిషన్, శైలేంద్ర, హస్రత్ జైపురి ల టీమ్ ముంబై -పుణే నగరాల మధ్యదారిలో వున్న 'ఖండాలా' అనే హిల్ స్టేషన్ కు వెళ్ళడంఅలవాటు. మార్గంమధ్యలో రోడ్ ప్రక్కన వుండే ఒక పాక లాంటి హెూటల్లో స్నాక్స్ తోబాటు తేనీరు సేవించడం అంటే వీరికి ఎంతో ఇష్టం.... అలవాటు కూడా. ఆ చిన్న హెూటల్లో 'రామయ్య' అనే తెలుగబ్బాయి వెయిటర్ గా పనిచేవాడు. అతనికి శంకర్, జైకిషన్ లు సంగీత దర్శకులు అనే విషయం తెలియదు. ఆ హెూటల్లో ఆగినప్పుడల్లా శంకర్ రామయ్యను అచ్చ తెలుగులో పిలిచి కాఫీ ఫలహారాలు సర్వీస్ చేయించునేవాడు. ఆ అబ్బాయి కూడా శంకర్ వచ్చినప్పుడల్లా అతనికి చక్కని ఆతిథ్యాన్ని అందించేవాడు. 'శ్రీ 420' మ్యూజికల్ సిట్టింగ్ కోసం ఖండాలా వెళ్తూ ఒకసారి ఈ హెూటల్ వద్ద నలుగురు ఆగారు. "రామయ్యా" అని శంకర్ ఆ కుర్రాణ్ణి పిలిచాడు. అప్పటికే ఆ హెూటల్ లో ఆసీనులైన కస్టమర్ల కు స్నాక్స్, తేనీరు అందిస్తూ బిజీగా వుండడంతో రామయ్య "వస్తున్నాను సార్" అని సైగ చేశాడు. అతడు రావడం ఆలస్యం కావడంతో శంకర్ "రామయ్యా... వస్తావయ్యా" అని రెండుమూడుసార్లు పిలిచాడు. రామయ్య రాలేదు. ఇక శంకర్ కు సహనం నశించి "రామయ్యా వస్తావయ్యా" అంటూ లయబద్ధంగా పాడడం మొదలెట్టాడు. అందుకు జైకిషన్ లయబద్ధంగా టేబుల్ మీద దరువేస్తూ తబలా శబ్దాలు వినిపిస్తున్నాడు. "రామయ్యా వస్తావయ్యా" అనే మాటల్నే శంకర్ పదేపదే పాటరూపంలో వినిపిస్తుండగా విసుగొచ్చిన హస్రత్ జైపురి "రామయ్యా వస్తావయ్యా" మాటలు తప్ప మరే మాటలూ లేవా!" అనడంతో శైలేంద్ర వెంటనే "నీ రాకకోసం ఎదురుచూస్తున్నాం" అనే అర్థం వచ్చేలా, "మైనే దిల్ తుఝ్ కో దియా" అని శంకర్ పాటకు మాటలు జతచేశాడు. తర్వాత రామయ్య రావడం, ఈ నలుగురికీ అద్భుతమైన ఆహార సేవలు అందించడం, వారు ఖండాలా కు వెళ్ళిన తర్వాత ట్యూన్ చేసి రాజ్ కపూర్ కి శంకర్ ఈ పల్లవి వినిపించడం జరిగిపోయింది. రాజ్ కు ఈ పల్లవి బలే నచ్చేసింది. "రామయ్యా వస్తావయ్యా స్థానంలో ఏవైనా హిందీ/ఉర్దు పదాలు పెడదామా" అని శంకర్ రాజ్ కపూర్ ని అడిగాడు. రాజ్ కపూర్ "వద్దు... ఈ తెలుగు పదాలే వుంచండి. బాగున్నాయి" అనడంతో శైలేంద్ర చరణాలు రెడీ చేశాడు. మహమ్మద్ రఫీ, ముఖేష్, లతా మంగేష్కర్ ఆలపించిన ఈ పాట సూపర్ హిట్ అయింది పాటను కూలీ నాలీ చేసుకుంటూ చిన్నచిన్న ఇళ్ళల్లో నివసించే జనం మధ్య ఒక స్ట్రీట్ సాంగ్ గా రాజ్ కపూర్ తనదైన శైలిలో ఈ పాటను చిత్రీకరించారు. పాట చివరి చరణం నర్గీస్, రాజ్ కపూర్ ల మీద చిత్రీకరించటం హైలైట్. ఆ పాట ఎంత హిట్టయిందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా తెలుగు పదాలు వుండడంతో ప్రతి తెలుగు సంగీత అభిమాని ఆ పాటను హమ్ చేస్తూనే వున్నాడు.... ఆ పాట వచ్చి డెబ్బై సంవత్సరాలు కావస్తున్నా.... తరచూ వినపడుతూనే వుంది."రామయ్యా వస్తావయ్యా" పాటలో ముఖ్య లేడీ డ్యాన్సర్ పేరు షీలా వాజ్. ఆమె స్వస్థలం గోవా. జానపద నృత్యాలు ఆమెకు కొట్టిన పిండి.

-ఆచారం షణ్ముఖాచారి

# సర్వం కృష్ణార్పణం..

## కుంతీదేవి విచిత్ర వరం



రోజూ ఏదో ఒక బాధను వరమై అడిగిన కుంతీదేవి....ఎందుకని?

కురుక్షేత్ర పోరు ముగిసింది. ధర్మానికీ అధర్మానికీ మధ్య యుద్ధంలో ధర్మం గెలిచింది. పాండవులు కౌరవులు పక్షాలలో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అయినా ధర్మం నెగ్గినందుకు అందరికీ ఆనందమే.

ఇందుకు కారణమైన కృష్ణుడు భారతయుద్ధం ముగి సాక తన ప్రాంతానికి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నారు.

అయితే తన అత్త కుంతీదేవితో ఓ మాట చెప్పి వెళ్ళాలనుకున్నాడు కృష్ణుడు.

అప్పుడు కుంతీదేవి "కృష్ణా! మమ్మల్ని విడిచిపెట్టి పోతున్నావా? నిన్ను రోజూ చూసే భాగ్యం నాకిక లేదా?" అని బాధపడింది.

"ఈ భూమ్మీద ఏదీ స్థిరమైనది కాదు. కలిసున్నవారు విడిపోవడం, విడిపోయిన వారు కలిసిపోవడం వంటిదికూడా అలాంటిదే. నీ విచారం తొలగిపోయే రీతిలో నీకొక వరం ఇస్తాను. నీకేం కావాలో కోరుకో" అన్నాడు కృష్ణుడు.

కుంతీదేవితో కృష్ణుడు మాట్లాడుతున్న తరుణంలో పాండవులు, ద్రౌపది కూడా అక్కడున్నారు. కుంతీదేవి ఏ వరం కోరుతుందోనని వారు ఆత్రుతతో చూస్తున్నారు.

ఎలాగైనాసరే తన జీవితం సౌఖ్యంగా ఉండేటట్లు, ఎప్పుడూ సంతోషంగా ఉండేటట్లు కుంతీదేవి వరం అడు గుతుందనే అక్కడున్న వారందరూ అనుకున్నారు

కానీ కుంతీదేవి అడిగిన వరం అందరినీ విస్తుపోయేలా చేసింది. పైగా ఆమెకు మతి గతి తప్పిందా అనుకుని కూడా ఉండొచ్చు. అవును... ఎందుకంటే కుంతీదేవి అడిగిన వరం అలా అన్పించేలా ఉంది.

"నాకు రోజూ ఓ బాధనివ్వు" అని ఎవరైనా భగవంతుడిని కోరితే వారి గురించి మరి వేరే విధంగా ఎలా అనుకుంటారు?

కృష్ణుడిని చూసి కుంతీదేవి ఆ మాటే అడిగింది.

"కృష్ణా! రోజూ నాకొక బాధనైనా ఇవ్వు" అంది.

అన్నీ తెలిసిన వాడైనప్పటికీ అక్కడున్న వారందరికీ కుంతీదేవి అలాటి వరాన్నెందుకు అడిగిందో అర్థమవాలని కుంతిని చూసి అడిగాడు కృష్ణుడు "అత్తా! అందరూ సంతోషంగా బతకాలి. సౌభాగ్యంతో ఉండాలి. నా పిల్లలు ఆరోగ్యవంతులై ఉండాలి....వంటి వరాలు అడుగుతారు.

కానీ నువ్వు రోజూ ఓ చిరు బాధనైనా ప్రసాదించమని అడుగుతున్నావేంటీ" అని అడిగాడు.

"ఈరోజు వరకూ నాకు ఎప్పుడు ఏ కష్టమొచ్చినా బాధ కలిగినా దుఃఖమొచ్చినా నేను నిన్నే తలుచుకునే దానిని. యుద్ధం కారణంగా ఇప్పటివరకూ నువ్వు నాతోనే ఉన్నావు. నిన్నే చూస్తుండటంతో నా బాధలూ దుఖాలూ అన్నీ పోయాయి. ఇప్పుడు నువ్వు నన్ను విడిచిపెట్టి పోతానంటున్నావు. కనుక నేను నిన్ను తలవకుండా ఉండిపోతానేమోనన్న భయం నన్ను పట్టుకుంది. రోజూ ఏదో ఒక బాధ ఇస్తే ఆ కారణంగానైనా నిన్ను తలచి నన్ను నేను ఓదార్చుకుంటాను. కనుక నాకు బాధను వరమై ప్రసాదించు" అని చెప్పింది కుంతీదేవి.

నిజమే, ఆనందంతో ఉన్నప్పుడు ఆ ఆనందంలో భగవంతుడిని మరచిపోవడం సహజమే. దుఃఖమో బాధో అంటూ ఒకటుంటేనే అప్పుడప్పుడైనా భగవంతుడిని తలచి నమస్కరించుకుంటాం. మన మొర చెప్పుకుంటాం. ఒక్కొక్క బాధ ఓ అనుభవాన్నిస్తుంది. ఎదురయ్యే కష్టాలను అధిగమించడానికి, విజయం సాధించడానికి కావలసిన సూక్ష్మాన్ని మనిషి తెలుసుకుంటాడు. అంతేకాకుండా భగవంతుడితో మమేకమై చేసే ప్రార్థనతో బాధ మటుమాయమై ఆనందం కలుగుతుంది.

కృష్ణా! నీ పాదపద్మాలకు శరణం శరణం.

- యామిజాల జగదీశ్

## చేయెత్తి జైకొట్టిన తెలుగోడు..

### నేడు వేములపల్లి శ్రీకృష్ణ వర్ధంతి



వేములపల్లి శ్రీకృష్ణ (1917 -8/4/2000) ప్రముఖ కమ్యూనిష్టు నేత, శాసనసభ్యులు, కవి. వీరు "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" అనే గేయాన్ని రచించి తెలుగు ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా బేతపూడి గ్రామంలో జన్మించారు. రేపల్లె లో ఉన్నత విద్యనభ్యసించి, గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ప్రముఖ కమ్యూనిష్టు నాయకులు పులుపుల వెంకట శివయ్య గారి ప్రోత్సాహంతో 1938లో కమ్యూనిష్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. 1948లో గుంటూరు జిల్లా కమ్యూనిష్టు కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1940 దశకంలో సాంస్కృతిక ఉద్యమంలో చురుకుగా పాల్గొని గేయ రచనలోను, వివిధ జానపద కళారూపాలను వెలుగులోకి తేవడానికి సహాయపడ్డారు. 1950 దశకంలో ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ కాలంలో "చేయెత్తి జై కొట్టు తెలుగోడా.. గతమెంతో ఘన కీర్తి కలవోడా .." అనే గేయాన్ని రచించి తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిపోయారు. ఈ పాట ఘంటసాల గళంలో 1952లో పల్లెటూరు చిత్రంలో తెలుగునేల నాలుగు చెరగులా మార్మోగింది. వీరు మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. మొదట బాపట్ల నియోజకవర్గం నుండి 1952లో మద్రాసు శాసనసభకు, తరువాత 1962, 1972 ఎన్నికలలో మంగళగిరి నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభ లోనూ సభ్యులయ్యారు. 1964-65 విశాఖ ఉక్కు కర్మాగారం ఉద్యమంలో తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1968 నుండి 1972 వరకు విశాలాంధ్ర దినపత్రిక కు సంపాదకత్వం వహించారు. హైదరాబాదులోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ కు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. వీరు ఏప్రిల్ 8, 2000 న హైదరాబాదులో పరమపదించారు. మరణానంతరం తన నేత్రాలను ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. 1998లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయరచయితల సంఘం, గుంటూరు జిలాశాఖ వారిచే అమరజీవి పులుపుల వెంకటశివయ్య సాహితీ సత్కారం అందుకున్నారు.

సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

# ఐ కేర్ ఆస్పత్రి ప్రారంభం





శ్రీకాకుళం (విశాఖ సమాచారమ్) : పట్టణంలోని మంచు ఐ కేర్ నేత్ర చికిత్స ఆస్పత్రిలో చక్కటి ఫలితాలు వస్తున్నాయని, శ్రీకాకుళంలో ఉండడం ఇక్కడ ప్రజల అదృష్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలోని బలగలో నూతనంగా నిర్మించిన మంచు ఐ కేర్ ఆస్పత్రిని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యుడు గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు.

# కిన్నాంగుడాలో తాగునీటి ఇక్కట్లు



అరకులోయ (విశాఖ సమాచారమ్): - అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలి మండలం సుంకర మెట్ట పంచాయతీ కిన్నాం గుడా గ్రామంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని మహిళాలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సుంకర మెట్టు సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు మాట్లాడుతూ కిన్నాం గుడా గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.18 లక్షలతో జల్ జీవన్ మిషన్ మంజూరైందన్నారు. టెండర్ పూర్తి కాగా, గవర్నమెంట్ అప్రూవల్ రాకపోవడం వల్ల కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేద న్నారు. నాబార్డ్ వాటర్ స్కీం ద్వారా వేసిన పైపు లైన్‌కు కిన్నాం గుడా గ్రామంలో ట్యాంక్ లేనందున కనెక్షన్ ఇవ్వడం కుదరలేదన్నారు. గ్రామంలో ఎండ తీవ్రతకు ఊట గెడ్డలు ఇంకిపోయి గుక్కెడు నీరు దొరకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి నాబార్డ్ వాటర్ స్కీమ్ ద్వారా వేసిన పైపు లైన్‌కు గ్రామంలో ట్యాంక్ నిర్మించి ప్రతి గడపకు కుళాయి లు ద్వారా తాగు నీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వార్డు మెంబర్ కుమిడి రాము, కొర్ర కొములు,డి.కల్యాణకుమార్, వి.మదన్, కొర్ర సురేష్, మొత్తి, మహిళాలు పాల్గొన్నారు.

# Spoken English -20

#Basic English Speaking#

@ MUSIC @

What kind of music do you like? నీకు ఏ రకమైన సంగీతమంటే ఇష్టం?

I'm crazy about Pop music.- పాప్ మ్యూజిక్ అంటే నాకు క్రేజీ.

Is that the kind of music preferred in your country?-: ఆ రకమైన సంగీతంకు మీ దేశంలో ప్రాధాన్యత ఇస్తారా?

It varies. Normally the youth enjoy Rock and Pop while middle-aged citizens prefer country music.- తేడాలున్నాయి. సహజంగా యువత రాక్, పాప్ సంగీతాన్ని ఎంజాయ్ చేస్తారు.నడి వయసు వారు దేశీయ సంగీతానికి ప్రాధాన్యత ఇస్తారు.

Who is your favorite singer?- మీ అభిమాన గాయకులు ఎవరు?

I'm a big fan of Miley Cyrus, a talented US singer, songwriter, and actress.- యుఎస్ఏ కు చెందిన గాయని, గీత రచయిత,నటి మైలీ సైరస్ కు అభిమానిని.

What piece of music do you like? Who sang that song? - నీకు ఇష్టమైన పాట ఏది? ఆ పాటను ఎవరు పాడారు?

My favorite song is Jolene, sung by Miley Cyrus.- నేను ఇష్టపడే పాట జోలేన్..,దానిని సైరస్ పాడింది.

How much time a day do you spend listening to music?- రోజుకి సంగీతాన్ని వినడానికి ఎంత సమయాన్ని నీవు కేటాయిస్తావు?

I usually listen to music all day with an MP3 player.- ఎంపి3 ప్లేయర్ మీద రోజంతా సంగీతాన్ని వింటాను.

Do you feel relaxed listening to music?- సంగీతం వినడం ద్వారా నీవు రిలాక్సేషన్ ఫీల్ అవుతావా?

Sure. I feel like there are no more worries in the world.- తప్పకుండా.లోకంలో ఇక ఏ భాధలు వుండవన్నట్లుగా ఫీల్ అవుతాను.

Why is music important to us?- సంగీతం మనకు ఎందుకు ముఖ్యం.

Music has the power of beautifying our life.- సంగీతానికి మన జీవితాన్ని సుందరీకరించే శక్తి వుంది.

What do you think about the teenagers' music style?- టీనేజర్స్ యొక్క సంగీత శైలి ఎలా వుంటుందని మీరు భావిస్తున్నారు?

Teenagers tend to choose loud and fast music like Rock or Rap.- టీనేజర్స్ రాక్, పాప్ , స్పీడుగా ,అతి ధ్వనులతో వుండే సంగీతాన్ని ఎంచుకుంటారు.

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

**(Visakha Samacharam)**

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి అని ఆళ్వార్ దాస్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో నేతృత్వంలో ఎంపీపీ కాలనీ లోని ఆల్వార్ దాస్ కళాశాలలో మొక్కలు నాటి, పక్షుల కోసం మట్టి పాత్రలలో నీరు ఏర్పాటు చేసి, పిచ్చుకలకు గూళ్ళు ఏర్పాటు చేసిన తర్వాత మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జయప్రదం చేయండి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పండిన పంటలు భుజించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి, ఎకో వారియర్ అయిన జే వి రత్నం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలని కోరారు.ఎకో వైజాగ్ ను జయప్రదం చేయాలని కోరారు. అలాగే ప్రతి విద్యార్థి మొక్కలు నాటి నీరు పోస్తూ అవి పెరిగేలా చూడాలన్నారు. ఈ వేసవి కాలంలో తాము ఆరగించిన పళ్ళ గింజలు ఆరబెట్టాలని, వచ్చే వర్షాకాలంలో వాటిని కొండల మీద వేయాలని కోరారు. భూ ఉపరితలం వేడెక్కకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు.

ఈ కార్యక్రమంలో లెక్చరర్లు అప్పారావు, రాజేష్, ఎన్ రాణీ ప్రియాంక, గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి, ఐ కృష్ణ కుమారి, జె రవి తేజ తదితరులు పాల్గొని మాట్లాడారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

వేలం క్యాటలాగ్ నెం.: CAT-PARK-00073

Seq.No. AA/1: లాటు నెం./క్యాటగిరి: పార్కింగ్-WAT-BGHU-MX-122-25-1(పార్కింగ్ మిక్స్డ్) వివరణ: బొర్రాగుహలు స్టేషన్ వద్ద పార్కింగ్ (సైకిల్, టూ వీలర్ మరియు 4 వీలర్), రెంటల్ మరియు వాష్ (2 వీలర్స్).

యూనిట్ రేటు: వార్షిక లైసెన్సింగ్ ఫీజు, త్రైమాసికాలు/రోజులు: 1096, లాటు ప్రారంభ తేదీ & సమయం: 09.04.2025న 1100 గంటలు, లాటు ముగింపు తేదీ & సమయం: 09.04.2025న 1130 గంటలు, కనీస పెంపుదల (%): 0.2, లాటు స్టేటస్: ప్రచురించిన క్యాటలాగ్ నందు కొత్తది.

పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వాల్తేరు

PR-14/Q/25-26

# పి జి ఆర్ ఎస్ లో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) : ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ ఎస్) కార్యక్రమంలో సమస్యలు పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పించేందుకు వచ్చే విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అమలు జరుగుతున్నాయని విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,సహాయ సంచాలకుడు బి.ఆశయ్య తెలిపారు. దినపత్రికలలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు సౌకర్యాలు లేవని వచ్చిన వార్తలపై వివరణ ఇస్తూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీలు సమర్పించేందుకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం మొదటి తలుపు మెట్ల ప్రవేశద్వారం వద్ద వీల్‌చైర్ ఉంచుతున్నామని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన దరఖాస్తు దారులు కలెక్టరేట్‌కు ఫిర్యాదు కోసం వస్తే, వారికి సహాయం కోసం ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బంది(వీఆర్ఏ)ని నియమించినట్టు తెలిపారు. అంతేకాకుండా వారు కూర్చునేందుకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం పీజీఆర్ఎస్ ప్రత్యేక అధికారి లేదా సంబంధిత అధికారికి తెలియజేయడం జరుగుతుందని, అధికారులు నేరుగా అర్జీదారుని వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరిస్తున్నారని తెలిపారు. సమావేశ మందిరంలోకి వచ్చే అర్జీదారులకు వీల్‌చైర్, లిఫ్ట్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు అర్జీలు అందజేసిన తర్వాత సొంత వాహనం లేదా ఆటోలో కూర్చునే వరకు సిబ్బంది సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ




తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో "ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు" అనే నినాదంతో మలకపల్లి ఆరోగ్య కేంద్రం నుండి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతు తల్లులు మరియు శిశువులు ఆరోగ్యంగా ఉండటం వలన ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది కనుక తల్లుల ఆరోగ్యం మరియు శ్రేయస్సు పై ప్రతేక శ్రద్ద వహించడం ద్వారా ప్రసవానికి ముందు సమయంలో మరియు ప్రసవానంతర సమయంలో వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చూడవచ్చని మరియు శిశువుల ఆరోగ్యం పై కూడా ప్రత్యేకమైనా శ్రద్ద వహిస్తూ వారికి ఇవ్వవలసిన ఆహారం అందించడం మరియు టీకాలను సక్రమంగా వేయించడం, అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే ఆసుపత్రిని సందర్శించి తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా శిశు మరణాలను నివారించవచ్చని కనుక ప్రతి ఒక్కరు తల్లుల మరియు శిశువుల ఆరోగ్యం మరియు సంరక్షణ పై ప్రతేక శ్రద్ద వహించాలని తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా. పి.సుచందన ఎమ్.పి.హెచ్.ఈ.ఓ ఎస్.రమేష్, పి.హెచ్.ఎన్. ఎమ్.వేదకుమారి, హెల్త్ సూపర్వైజర్ బి.కృపావరం మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**పి.జి.ఆర్.ఎస్‌కు జిల్లా అధికారులు తప్పక హాజరవ్వాలి**
**కలెక్టర్ విజయ కృష్ణన్**



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను ఆదేశించారు.సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్.కార్యక్రమంలో కలెక్టరు విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్య నారాయణరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో పెండింగ్‌అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులు మాత్రమే హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందిని పంపించకూడదని ఆదేశించారు. అదేవిధంగా డివిజన్, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పీజీ ఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి దరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని దరఖాస్తుల గురించి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయాలని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షించాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల నుండి పత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

# క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన హౌసింగ్ బోర్డు చైర్మన్



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్) :- చోడవరం మండలం ముదుర్తి మామిడిపాలెం బ్రిడ్జి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాధితుడిని రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తన కారులో ఆసుపత్రికి తరలించారు. లారీ స్కూటీని ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఆ సమయంలో హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, పైలా గోపీ సహాయ సహకారాలు అందించడంతో పలువురు అభినందనలు తెలిపారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టులో ట్రైనీ పైలట్ ఉద్యోగాలు




కోల్‌కతాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టు ఖాళీగా ఉన్న ట్రైనీ పైలట్ పోస్టుల భర్తీకీ దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 21వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు- ఖాళీలు**

ట్రైనీ పైలట్: 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నాటికల్ సైన్స్, మాస్టర్(ఎఫ్‌జీ)/ డ్రెడ్జ్ మాస్టర్ గ్రేడ్-1, ఎఫ్‌జీ డ్రెడ్జ్ మాస్టర్ గ్రేడ్-2లో ఉత్తీర్ణత ఉండాలి.

వయోపరిమితి: 1-03-2025 తేదీ నాటికి 25 నుంచి 40 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు రూ. 50,000 - రూ.70,000.

శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఉద్యోగాలు

దరఖాస్తు ప్రక్రియ: ఆఫ్‌లైన్ ఆధారంగా.

చిరునామా: డైరెక్టర్, మెరైన్ డిపార్ట్‌మెంట్, శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా, 15వ స్ట్రాండ్ రోడ్, కోల్‌కతా-700001.

## సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐలో ఖాళీలు




సీఎస్ఐఆర్- సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మైసూరు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మే 7వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు - ఖాళీలు

1. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్): 04
2. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్%ఊ%ఏ): 04
3. జూనియర్ స్టెనోగ్రాఫర్: 06

మొత్తం ఖాళీల సంఖ్య: 14

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2025 మే 7వ తేదీ నాటికి జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లు, స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు మించకకూడదు.

జీతం: నెలకు జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.36,220, స్టెనోగ్రాఫర్‌కు రూ.47,415.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.

ఎంపిక విధానం: రాత పరీక్ష ఆధారంగా.

దరఖాస్తు చివరి తేదీ: 07-05-2025.

## స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మెడికల్ ఆఫీసర్ ఖాళీలు




స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 11వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

పోస్టు పేరు-ఖాళీలు

లి మెడికల్ ఆఫీసర్: 03

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, డీఎన్‌బీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 50 ఏళ్లు.

జీతం: నెలకు రూ.1,25,000.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతల్లో సాధించిన మార్కుల మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తుకు చివరి తేదీ: 11-04-2025.

# నూకంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అనకాపల్లి (విశాఖ సమాచారమ్) : నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త అమావాస్య, రాష్ట్ర జాతర మహోత్స వాల్లో భాగంగా మొదటి ఆదివారం అధిక సంఖ్యలు భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ ఎం కే జోగి నాయుడు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ తదిరులు పాల్గొన్నారు

# ఉపాధి కూలీల వినూత్న నిరసన



కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- మండలం సింగన్న దొరపాలెం, కె.కోటపాడు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశాల్లో ఉపాధి హామీ బిల్లులను చెల్లించాలని కోరుతూ చేతులు జోడించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి ఇర్లే నాయుడుబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.54 కోట్లు ఉపాధి హామీ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 10 వారాలు నుండి బకాయిలు చెల్లించకుంటే ఎలా బతకాలి అని ప్రశ్నించారు. ఏప్రిల్ 1 నాటికి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రూ.54 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నంది పురస్కారం అందుకున్న అంజనేయులు రెడ్డి



కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్) : విభిన్న రంగాలలో ప్రజలకు సేవలు అందించిన సేవ మూర్తులకు పాన్ ఇండియన్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో రాజమండ్రి ఏటీసీ రోటరీ హాల్‌లో ఉగాది నంది జాతీయ పురస్కారాలు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, రచయిత, గాయకుడు గజల శ్రీనివాస్ పాల్గొని ప్రముఖులకు నంది పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగానే కాకినాడకు చెందిన సేవారత్న అనుపాల అంజనేయులు రెడ్డి చేస్తున్న సేవలకు గాను దుశ్శాలువాతో కప్పి ప్రశంస పత్రం తో పాటు నంది అవార్డు తో సత్కరించారు. కార్యక్రమంలో కళారత్న కత్తిమండ ప్రతాప్, హారిక నర్సిపల్లి పిఠాపురం రాజా బహుదూరు రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఇటుకల పండగ



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పాజోర్ (ఇటుకల పండగ)అని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టీడీపీ అరకు నియోజక వర్గ ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాల్లో ఇటుకుల పండగ సందడి నెలకొంది. ఆదివాసీ మహిళలు పాజోర్ పట్టి వేడుకల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ పర్యటన నేపథ్యంలో ఎక్కడికక్కడ గిరిజన మహిళలు పాజోర్ పట్టి ఆయనకు తిలకం దిద్ది స్వాగతం చెబుతున్నారు.ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విభిన్న సంస్కృతి-సంప్రదాయాలు, సనాతన కట్టుబాట్లు ఆదివాసీలకు మాత్రమే సొంతమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రపంచీకరణ నేపథ్యంలో సనాతన సంప్రదాయాలు దూరమై విదేశీ సంస్కృతులు అలవడుతున్న సరే గిరిజన ప్రాంతంలో మాత్రం ఆదివాసీల కట్టుబాట్లు , సంప్రదాయాలకు ఎప్పుడూ గౌరవం తగ్గలేదన్నారు. వాటి ఆదరణ ఎప్పటికీ కూడా పెరుగుతూనే ఉందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి అద్భుత నాగరిక సమాజంలో తాము కూడా జీవిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

# పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ పనులు : సిఐటియు



అచ్చుతాపురం : మండలం తిమ్మరాజు పేట గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని తిమ్మరాజుపేట సచివాలయం ,ఎంపీడీవో, ఏపీవో కార్యాలయాలు వద్ద పలు దఫాలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 1వ తేదీ నుంచి పనులు ప్రారంభిస్తావని ఎంపిడిఓ హామీ ఇచ్చారు, దీంతో నిన్నటి నుంచి ఉపాధి పనులు తిమ్మరాజుపేట గ్రామంలో ప్రారంభించారు. ఈరోజు పనులు చేస్తున్న కూలీలు వద్ద కలిసి పోరాడి ఉపాధి పనులు సాధించుకున్న కూలీలకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ. అప్పారావు మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వామపక్ష పార్టీలు పోరాడి సాధించాయని ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించి వేస్తున్నదని గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు 200 రోజులు పని కల్పించి రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని మండుతున్న ఎండల్లో పని చేస్తున్న కూలీలకు టెంట్లు, నీళ్ల వంటి సౌకర్యాలు కల్పించి ప్రతి 15 రోజులకి కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరగడం రామనాయుడు, నడుపురు. సన్యాసిరావు, సెల్లు పోయిన అప్పారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# పరవాడలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పరవాడ, (విశాఖ సమాచారమ్) : మండల కేంద్రమైన పరవాడ సంత బయలు వద్ద బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నాయకులు కూండ్రపు సోమనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి నమో బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాల అప్పారావు, మండల అధ్యక్షుడు పిల్లా సతీష్ ప్రసంగించారు. గతంలో ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి రావడమే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో పి.బోనంగి సర్పంచ్ కల్పన రాజశేఖర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు బంతికోరు గోవింద్, కురచ సరస్వతి, వైస్ ప్రెసిడెంట్ పి. సత్యారావు, పార్టీ జిల్లా యువమోర్చా కార్యదర్శి మోస రామకృష్ణ, స్థానిక నాయకులు నూకరాజు, సోమశేఖర్, నాగరాజు, అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాంబిల్లిలో**



రాంబిల్లి (విశాఖ సమాచారమ్):- బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ రాజు, రాష్ట్ర కిషన్ మోర్చా కార్యదర్శి ధర్మాల గోవింద్ రెడ్డి, జిల్లా మోర్చా కార్యదర్శి సొరాడ తేజ, మండల ప్రధాన కార్యదర్శి సిగిరెడ్డి నాయుడు, లంక భాస్కరరావు, మండల మహిళా మోర్చా దేవి, మండల యువ మార్చా రవితేజ బీజేపీ సీనియర్ నాయకుడు మైలిపిల్లి కాశీ, మండల వైస్ ప్రెసిడెంట్ ఏరిపిల్లి సత్యారావు, గంగరాజు, బీజేపీ కార్యకర్తలు చోడి పెల్లి రమణ, మైలిపిల్లి కోదండరావమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



**అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో**

బీజేపీ 45 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులకు పండుగ లాంటిదని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్, క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి విజయ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లిలో**



బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అనకాపల్లి పట్టణం జీవీఎంసీ 80 వ డివిజన్ అధ్యక్షుడు మారిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో శంకర్ థియేటర్ దాసరి గడ్డ రోడ్డు కూడలిలో జెండా ఆవిష్కరణ చేశారు. ప్రపంచ దేశంలో భారతదేశ చరిత్ర చాలా గొప్పదని అంటూ ఈ దేశంలో భారత జనతా పార్టీ కాశీ నుంచి కన్యాకుమారి దాకా విస్తరించి ఉన్నదన్నారు. హిందూ ధర్మ క్షేత్రంలో ఈ పార్టీ ఆవిర్భావం దగ్గర నుంచి ఈ రోజు వరకు నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేస్తూ ఎంతో విజయం సాధించారన్నారు.ఆ రోజున పార్టీ బలిదానాలు చేసిన నాయకులకు పాదాభివందనాలు తెలియజేసారు. గవరపాలెంలో భారత జనతా పార్టీని విస్తృతస్థాయిలో విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉడా రమేష్, మండల అధ్యక్షుడు కొమనాపల్లి సన్యాసిరావు, మన్ కీబాత్ అధ్యక్షుడు రాపేట్ సంతోష్, అంబేద్కర్ మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చట్టాల పై మహిళలకు అవగాహన అవసరం

## డాక్టర్ కందుల నాగరాజు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మహిళా రక్షణ చట్టాలపై మహిళలందరికీ పూర్తి అవగాహన అవసరమని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు.

భీమ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో మహిళా రక్షణ చట్టాలపై , మహిళా హక్కులు, పథకాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భ్రూణ హత్యలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆడ, మగ సంతానం ఇద్దరిని సమానంగా చూసినప్పుడే సమాజంలో మహిళల పట్ల చులకన భావన పోతుందన్నారు. ఆడ పిల్లలకు కుటుంబ కట్టుబాట్లు నేర్పించడం వల్ల వారిలో బెరుకు, భయం వంటివి వస్తాయన్నారు. బాలికల పట్ల సద్భావం ఏర్పడేలా పాఠశాల దశ నుంచే బాలురకు వారి తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు కట్టడి అవుతాయని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకు వచ్చాయని, మహిళలు వాటిని వినియోగించుకుని సమాజంలో నిర్భయంగా తిరగాలన్నారు. మహిళా చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకుని మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీ పడుతూ దూసుకుపోవాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాల నివారణ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిరోధించడం వంటి అనేక మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షించండి, చదివించండని అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ నళిని, వెల్ఫేర్ సెక్రటరీ మధు, మహిళ పోలీస్ రాధ వి.ఆర్.ఓ సంతోషి,హెల్త్ సెక్రటరీ కుమారి, భీమ్ నగర్ అంగన్వాడీ సిబ్బంది ప్రవీణ్, పూతి వారి మాన్యం అంగన్వాడీ సిబ్బంది పార్వతి దేవి తదితరులు పాల్గొన్నారు.

# దూరదర్శన్ ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా షఫి మహమ్మద్



విజయవాడ, (పీఐబీ):- 2025 విజయవాడ దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా షఫి మహమ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. షఫి మహమ్మద్ 2009 బ్యాచ్ కు చెందిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి. ఆయన 2024 నవంబర్ నుంచి ప్రాంతీయ వార్తా విభాగంలో సహాయ సంచాలకుడిగా పదవి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో షఫి మహమ్మద్ ఒడిషా, తెలంగాణ, ఆంధ్ర, అండమాన్ నికోబర్ పోర్టుబ్లయిర్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పలు విభాగాల్లో పనిచేశారు. ఆయన క్షేత్ర ప్రచార విభాగం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ఆకాశవాణిలతో పలు పదవుల్లో పని చేశారు. ఇదే కాకుండా కేంద్ర ప్రభుత్వంచే వెలువడుతున్న యోజన అభివృద్ధి మాసపత్రికకు సంపదకుడిగా, డిఐపిటి ప్రాంతీయ సంక్షేమ అధికారిగా పలు విధులు నిర్వహించారు. దూరదర్శన్ వార్తా విభాగాన్ని మరింతగా మెరుగ్గా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ పథకాలను దూరదర్శన్ ద్వారా ప్రజల్లో తీసుకొని వెళ్లడానికి కృషి చేస్తానని షఫి మహమ్మద్ తెలిపారు.

## జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రారంభం



కొవ్వూరు/, (విశాఖ సమాచారమ్):- కొవ్వూరు గోవర్ధనగిరి మెట్ట ఫ్లైఓవర్ దగ్గర కాపవరం వద్ద ద్విసభ్య కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి చేత స్థాపించబడిన జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ట్స్ నూతన రైస్ మిల్ ప్రారంభోత్సవంలో గౌరవ ఆంధ్రా షుగర్స్ జెఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మంత్రివర్యులు కందుల దుర్గేష్, కంఠమని రామకృష్ణ, కూటమి నాయకులతో కలిసి కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# కమనీయం..సీతారాముల కల్యాణం



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- అరకువేలి మండలం చొంపి పంచాయతీ, కొత్తవలస గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్ధలతో, కోలాటాలతో భజన బృందాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నసమారాధన, కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి.గ్రామ మహిళల కోలాటాలు ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్తవలస, పానిరంగని, దళపతి గూడలలోని రామాలయాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ధార్మిక సత్సంగాలు, భజనలు, పల్లకీ సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకలు వారిలో ఏకత్వాన్ని, సహకారాన్ని పెంపొందించాయి. ప్రజలంతా కలిసి జరుపుకునే ఈ రకమైన ఉత్సవాలు గ్రామాభివృద్ధికి, సాంఘిక సమైక్యతకు బలమైన పునాది వేస్తాయని లంక గంగనాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సేలం అప్పల రామ్ లంక కృష్ణ నాయుడు లంక శంకర్రావు తవిటి నాయుడు వెంకటరమణ రాంప్రసాద్ర..నాగరాజు. బుజ్జి.రాము.చంటి రవి. సోమ నాయుడు తదితరులు పాల్గొన్నారు

## చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో..



చింతపల్లి, (విశాఖ సమాచారమ్):- శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో గల రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా, విద్యుత్ శాఖలో ఎస్ఈ గా విధులు నిర్వహిస్తున్న చౌడేపల్లి గ్రామానికి చెందిన ఎల్ మహేంద్ర నాథ్, అరుణ కుమారి దంపతుల చేత పూజారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేసి భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఏడాదికో మారు నిర్వహించుకునే సీతారాముల కల్యాణ మహోత్సవం తమ ఆధ్వర్యంలో నిర్వహించబడడం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. ఇటువంటి అవకాశాలు ప్రతి ఒక్కరికి కలగాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. అనంతరం సీతారాములను పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు సంప్రదాయ నృత్యాలతో పాటు, కోలాటాలు ఆడి భక్తులు ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో చౌడుపల్లి గ్రామస్తులతోపాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



**పరవాడలో..**

పరవాడ, (విశాఖ సమాచారమ్) : మండల కేంద్రమైన పరవాడలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా స్థానిక రామాలయం వద్ద సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు దంపతులు, ఎంపీపీ దంపతులు పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు దంపతులు, చీపురుపల్లి వెంకట ప్రశాంత్ దంపతులు కల్యాణంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, వేదమంత్రాలు సాక్షిగా, మంచి ముత్యాలు తలంబ్రాలతో కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ పోతల అప్పలనాయుడు, వార్డు మెంబర్లు గండి ఈశ్వరరావు, చుక్క వెంకటలక్ష్మి రాంబాబు, పైలా సత్యవేణి అప్పలనాయుడు, చీపురుపల్లి సన్యాసిరావు, సిరిపురుపు అయ్యబాబు, రొంగలి శ్రీను, బండారు శ్రీను, రాజాన రమణ, చుక్క చిన్నోడు, రొంగలి సన్యాసిరావు, పోతల మాధవరావు, పిల్లా జగదీష్, వానపల్లి అప్పలరాజు, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లిలో**



పట్టణం మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి తీసుకువచ్చిన స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమర శెట్టి రామ్కి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర,పార్లమెంట్ ఆఫీస్ ఇన్‌చార్జి విజయ నాయుడు, పలువురు పట్టు వస్త్రాలు, కర్పూరం దండలు, పూలదండలు సమర్పించారు. ప్రవీణ్ కుమార్ నీలిమ దంపతులచే కల్యాణం జరిగింది. సాయి నాట్యమండలి శిరీష ర్యాలీ శిష్య బృందం జానపద నృత్య ప్రదర్శన, తిమ్మా పాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య వాగ్దేయ వరదాయని బృంద సభ్యులచే సంకీర్తనలు, కోలాటకాలు ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో శాశ్వత గౌరవ అధ్యక్షుడు, కొణతాల జగన్నాథ రావు నాయుడు, అధ్యక్షుడు కె. నారాయణరావు మాస్టారు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి. దాసి రెడ్డి వెంకటేశ్వరరావు, సత్తివాడ దుర్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిమ్మ పాత్రుని వెంకటేష్, కార్యదర్శి. సిరసపల్లి రాజు, కోశాధికారి.పాముల ప్రసాద్. ఆలయ కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



**పైడిమెట్టలో**

తాళ్లపూడి మండలంలో పైడిమెట్ట గ్రామంలో శ్రీరామ నవమి పండుగను రామాలయంలో ఘనంగా నిర్వహించి శ్రీరామునికి సీతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో పూజలో పాల్గొన్న దంపతులు చాదరాశి నాగరాజు సునీత, మరియు జనార్ధన్ ,రాజీవ్ ,సుబ్రమణ్యం దంపతులు రాముని ముంగిట కళ్యాణం జరిపారు. ఇందులో భాగంగా పెద్దలు,సూరిబాబు,కొండలరావు, పోసియ్య, వాసు, యువతీ, యువకులు: లావణ్య, బాలాజీ, పలువురు పానకాలు , పులిహోరను భక్తులకు పంచారు.

**తాళ్లపూడిలో**



తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పడమట వీధి రామాలయం వద్ద రెండు వేల మందికి అన్న సమరాధన జరిగిందని ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్దేవం గ్రామ పెద్దలు, తోట రామకృష్ణ మరియు యువకులు తెలియజేసారు.

**పెదరామ స్వామి ఆలయంలో**



గవరపాలెం పెద రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సహకారంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం దాడి జగన్ ప్రభాకర్, షర్మిల దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ ప్రారంభించారు

### మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పైడారావు

# జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు జన్మదినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఫోరం ఫర్ సోషల్ రేట్స్ జిల్లా అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు, కొట్టుమూరి మంగరాజు, ఆర్యవైశ్యుల సంఘం నాయకుల బొడ్డు సోమరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగలు అరెస్టు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్) :** వివిధ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేస్తున్న వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. సోమవారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ బుచ్చయ్యపేట స్టేషన్ పరిధిలోనే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం, వడ్డాది, అనకాపల్లి టౌన్, దువ్వాడ, కంచరపాలెం, విశాఖపట్నం ఫోర్త్ టౌన్ తదితర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట సమీపంలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తుల్ని అదుపులో అదుపులోనికి తీసుకొని విచారించగా విజయరామరాజుపేట గ్రామానికి చెందిన ఈ ముగ్గురు వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో 9 బైకులు దొంగతనం చేసినట్టుగా పోలీసులు ఎదుట ఒప్పుకున్నారని తెలిపారు.. దీంతో బుచ్చయ్యపేట పోలీసులు లోతైన విచారణ జరిపి 9 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బైకు దొంగతనాలకు పాల్పడిన వేగి వెంకటేశు, పెంటకోట చిరంజీవి, భీమరశెట్టి నానిలను అరెస్ట్ చేశామని అనకాపల్లి డిఎస్పి ఎం. శ్రావణి మీడియాకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎస్సై ఎ.శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### గిట్టుబాటు లేని ధాన్యం ధర

# అయోమయంలో రైతన్నలు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):-** రైతన్నకు వరి సాగు అధ్వానంగా మారింది. గడిచిన ఖరీఫ్ సాగు గుబులు పుట్టించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వేలాది ఎకరాలు వరి సాగు వరద ముంపునకు గురై రైతులు తీరని కష్టాన్ని, నష్టాన్ని చవి చూడవలసి వచ్చింది. పోనీలే భూమాత దాల్వ సాగులోనైనా రైతన్న కష్టానికి ఫలితం దక్కుతుందన్న ఆశతో పుట్టిన ప్రతిచోట అప్పులు తెచ్చి మరి రెండో పంట సాగుకు సిద్ధపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతన్న కష్టాన్ని గుర్తించలేకపోవడం దురదృష్టకరం. పండించిన వరి ధాన్యానికి మార్కెట్లో సరైన మద్దతు ధర లభించడం లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో ఉన్నటువంటి రైస్ మిల్లర్లు, ధాన్యం వ్యాపారులు రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనే పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదు. అవసరమైతే రైస్ మిల్లర్లు, ధాన్యం వ్యాపారస్తులు ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం దిగుమతులు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడ రైతు శ్రమించి పండించిన పంటను దళారులు సహకారంతో రైస్ మిల్లర్లు , ధాన్యం వ్యాపారులు రైతు కష్టాన్ని అడ్డగోలుగా మింగేస్తూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. మార్కెట్లో ప్రస్తుతం 100 కేజీల ఉప్పు బస్తా 1500 పలుకుతుంటే, 75 కేజీల బియ్యం బస్తా కేవలం రూ 1400 ధర పలకడం విశేషం. మరో పక్క 75 కేజీల ధాన్యం బస్తా దళారుల సహకారంతో 77 కేజీల 200 గ్రాములు చొప్పున రైతుల నుండి అడ్డగోలుగా మింగేస్తున్నారు. ఇలా రైతుల నుండి అడ్డుకోలుగా దోచుకుని ప్రతి రైస్ మిల్లర్లు, ధాన్యం వ్యాపారస్తులు సంవత్సరానికి రూ.10 నుండి రూ.20 కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకొని రైతులకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# పంచకర్మ థెరపీ కోర్సులో శిక్షణకు ఆహ్వానం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్) :** ఆరోగ్యధాత్రి ఆయుర్వేద పరిశోధనా సంస్థ ఇరవై సంవత్సరాల నుండి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది రోగులకు ఆయుర్వేద పంచకర్మ చికిత్సలను అందిస్తోంది. ఇప్పుడు మూడు నెలల ఇంటెన్సివ్ పంచకర్మ శిక్షణను ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా అందజేస్తున్నారు. ఈ కోర్సులో ఎన్నో ఆయుర్వేద చికిత్సలతో పాటు ఐదు పంచకర్మ చికిత్సలపై లోతైన శిక్షణను అందిస్తుంది. అర్హతలు ఆరోగ్యకరమైన శరీరం, సేవా దృక్పథం కలిగిన మనస్సుతో పాల్గొనేవారు క్రింది రంగాలలో అనుభవాన్ని సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పొందుతారు.




పంచకర్మ చికిత్సలు: వమన కర్మ (ఎమెసిస్ థెరపీ) -

విరేచన కర్మ (ప్రక్షాళన చికిత్స) -

వస్తి కర్మ (ఎనిమా థెరపీ) -

నస్య కర్మ (నాసల్ అడ్మినిస్ట్రేషన్) -

రక్తమోక్షణ చికిత్స (బ్లడ్‌లెట్టింగ్ థెరపీ)

అదనపు చికిత్సలు: శిరోధార: మానసిక ప్రశాంతత కోసం నుదుటిపై వెచ్చని మూలికా తైలం ను నిరంతరం పోయడం. షష్టిక శాలి పిండ స్వేదం: శరీరాన్ని బలోపేతం చేయడానికి హెర్బల్ రైస్ బోలస్ చికిత్స. పత్ర పొట్టాలి: నొప్పి, మంటను తగ్గించడానికి ఆయుర్వేద మూలికలతో కాపడం. అభ్యంగము: రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, ఆరోగ్యాన్ని పెంపొందించడానికి వెచ్చని ఆయుర్వేద తైలములతో తో పూర్తి శరీరాన్ని మసాజ్ . - బాష్ప స్వేదం: శరీరాన్ని నిర్విషీకరణ చేసి చైతన్యం నింపడానికి హెర్బల్ స్టీమ్ థెరపీ. పైన పేర్కొన్న ఐదు చికిత్సల వంటి దాదాపు 41 చికిత్సలు ఉన్నాయి, వాటన్నింటిలో శిక్షణ అందించబడుతుంది. ఈ కోర్సు ఆయుర్వేదం మరియు దాని సంపూర్ణ చికిత్సా పద్ధతులపై అవగాహనను పెంచుకోవాలనుకునే వ్యక్తుల కోసం రూపొందించబడింది. విజయవంతంగా పూర్తయిన తర్వాత మీరు ప్రసిద్ధ పంచకర్మ ఆసుపత్రులలో ప్రామాణికమైన ఆయుర్వేద చికిత్సలను అందించడానికి నైపుణ్యము మరియు జ్ఞానాన్ని పొందుతారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులందరికీ ఉద్యోగ హామీ ఇవ్వబడుతుంది. కోర్సు మే1 నుంచి ప్రారంభమై జూలై 31న ముగుస్తుంది. ఈ కోర్సు కోసం రిజిస్టర్ చేసుకోవడానికి చివరి తేదీ ఏప్రిల్ 26 మేము మీ రిజిస్ట్రేషన్ వివరాలను స్వీకరించిన వెంటనే ఆరోగ్యధాత్రి ఆయుర్వేద పరిశోధనా సంస్థలో ఇంటర్వ్యూ నిర్వహించి తర్వాత అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఆయుర్వేద వైద్యులు సుందర్ రాజ్ పెరుమాళ్ళ తెలిపారు. మరిన్ని వివరాలకు 8519970966, 7702434365 నంబర్లలకు ఫోన్ చేసి సంప్రదించమని కోరారు.

# అలరించిన నృత్య ప్రదర్శనలు



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్) :** నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండగ సందర్భంగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మీనాక్షి కూచిపూడి డాన్స్ అకాడమీ, కంచరపాలెం, నృత్య భారతి డాన్స్ అకాడమీ విశాఖ వారి ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి భరతనాట్యం నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా కార్యక్రమాలలో ముఖ్యఅతిథిలుగా అనకాపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, ప్రముఖ వైద్యుడు ఎం.బెనర్జీ, ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త శ్రీధరాల సూర్యనారాయణ, నూకాంబిక దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను హాజరయ్యారు. రాష్ట్ర పండగలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలు ప్రకటిస్తున్న సందర్భంగా ఈ ఆదివారం ప్రముఖ పవర్ లిఫ్టర్ రామలక్ష్మి, పారా ఒలింపిక్ వాలీబాల్ క్రీడాకారుడు అన్నం గణేష్ లకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ అమ్మవారి పండగ రాష్ట్ర పండుగగా ప్రకటించిన అనంతరం జరుగుతున్న ఈ కార్యక్రమాలను మాజీమంత్రి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పర్యవేక్షణలో జరుగుతున్నాయని అన్నారు. దేవస్థానం ధర్మకర్తలు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 ఫిర్యాదులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 42 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలు మొదలైన సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కోటవురట్ల మండలం, ఎండపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు గుడివాడ వరలక్ష్మి, కుమార్, వెంకట్‌ల ఫిర్యాదుపై ప్రత్యేకంగా స్పందించిన జిల్లా ఎస్పీ, నేరుగా వారి వద్దకే వెళ్లి సమస్యలు విన్నారు. కోటవురట్ల మండలం, అన్నవరం గ్రామానికి చెందిన నిందితుడు నక్క మాణిక్యం, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి రూ.10,50,000 కాజేశాడని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో, జిల్లా ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, ఫిర్యాదులన్నింటిపైనా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై డి.వెంకన్న పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు..రూ.లక్ష జరిమానా

## అనకాపల్లి, 10 వ అదనపు జిల్లా కోర్టు తీర్పు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) :** కశింకోట పోలీస్ స్టేషన్, మార్చి 2019లో నమోదైన హత్య కేసులో నిందితుడు శర్వణ్ కుమార్ గణపతిపై తీర్పు వెలువడిందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వివరాలను తెలియజేశారు.

కేసు వివరాలు: 2018 జూన్ 8న నిందితుడు శర్వణ్ కుమార్ గణపతి, మృతుడు కన్నన్ మునిరాజు ఇద్దరూ కంటైనర్ లారీలో కశింకోట హైవే సమీపంలోని కాళీ ప్రసాద్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భోజనం చేసిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల సమయంలో మునిరాజు, శర్వణ్ కుమార్ కు కితకితలు పెట్టగా, శర్వణ్ కుమార్ కింద పడిపోయాడు. ఈ ఘటనపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిన తర్వాత లారీ డ్రైవర్లు వారిని విడిపించారు. అనంతరం, మునిరాజు పెట్రోల్ బంక్ సమీపంలోని గుట్టపై విశ్రమిస్తుండ గా, ఆవేశంతో శర్వణ్ కుమార్ అతనిపై కాంక్రీట్ రాయితో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర రక్తస్రావం కారణంగా మునిరాజును స్థానికులు ఎన్టీఆర్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్ కి తరలించగా, జూన్ 9న మునిరాజు మరణించాడు.

కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపారు. అప్పటి అనకాపల్లి రూరల్ సీఐ జి.రామచంద్రరావు దర్యాప్తు పూర్తిచేసి అభియోగపత్రం దాఖలు చేశారు. 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు వాదనల అనంతరం న్యాయమూర్తి శ్రీమతి నందనవనం విద్య, నిందితుడికి జీవిత ఖైదు కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,00,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాసరావు వాదనలు సమర్థించగా, కోర్టు తీర్పును ప్రకటించింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అప్పటి దర్యాప్తు అధికారి అనకాపల్లి రూరల్ సీఐ జి.రామచంద్రరావుని, వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాసరావుని, కేసు విచారణలో భాగమైన పోలీసు సిబ్బందిని, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని అభినందించారు.



# నేలకొరిగిన మామిడి, మొక్కజొన్న





**కొవ్వూరు/ గోపాలపురం, (విశాఖ సమాచారమ్):-** కొవ్వూరు మరియు గోపాలపురం నియోజకవర్గాలలో నిన్న అకస్మాత్తుగా వాతావరణం లోని మార్పుల వలన వీచిన ఈదురుగాలులకు ఒక ప్రక్క జీడిమామిడి, మరో ప్రక్క మామిడి పిందెలు విపరీతంగా నేలకొరిగాయి. కరెంటు స్తంభాలు రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. రెండు మూడు గంటలు విద్యుత్ అంతరాయం కూడా ఏర్పడింది. అంతేకాకుండా పైడిమెట్ట,గజ్జరం, పోచవరం,, అన్నదేవరపేట, రోడ్డు మార్గాలలో చింతచెట్టు రోడ్డుకి అడ్డంగా పడిపోవడం మరోప్రక్క వర్షం ప్రజలు, ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు.

ఈ సంఘటన తెలుసుకున్న కొవ్వూరు ఆర్డీవో తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి రోడ్డు మార్గాలను క్లియర్ చేశారు.

# చిన భీమవరం పడమటమ్మ తల్లి 110 ఎకరాల భూమి కబ్జా!

- దేవాలయ భూములను అప్పనంగా మింగేస్తున్న స్థానిక భూ బకాసురులు
- చక్రం తిప్పుతున్న అనకాపల్లికి చెందిన వ్యక్తి
- గుడి ప్రాంగణంలో గ్రామస్తులు ఆందోళన







**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి) :-** మండలంలోని ఆర్.భీమవరం పంచాయతి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.173/ 3-19 లో గల చిన భీమవరం గ్రామానికి చెందిన మల్లాం గ్రామ సరిహద్దులు వరకు గల పడమటమ్మ తల్లికి చెందిన 110 ఎకరాలు డి- ఫారం భూమిని ధన బలం, రాజకీయ పలుకుబడి, అండదండలతో భూ బకాసురులు ఇష్టరాజ్యంగా కబ్జా చేసి ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 30 సంవత్సరాలకు పైగా పడమటమ్మ తల్లి భూములును ఆక్రమించుకొని ఇది అన్యాయం అని అడిగిన గ్రామస్తులను అనకాపల్లికి చెందిన బొడ్డెడ సన్యాసిరావు, స్థానిక వెలంకాయల అప్పలనాయుడు, వెలంకాయల గోవింద్ నాయుడు వారి కుటుంబ సభ్యుల గ్రామస్తులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు అంతా ముక్త కంఠం తో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆదివారం స్థానిక గ్రామస్తులు అంతా ఏకమై గ్రామం లో స్థానిక పడమటమ్మ తల్లి ఆలయ ప్రాంగణం లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ 1982 లో పాత సర్వే నెం.221 లో ఎటువంటి పట్టాలు లేకుండా ఖాళీ ఉన్న ఈ భూమి అనకాపల్లికి చెందిన బొడ్డెడ సన్యాసి రావు (షావు కారు) అనే వ్యక్తి గ్రామం అభివృద్ధి కోసం మా తాత, తండ్రులు ఫలసాయం అనుభవించి ఆలయాన్ని అభివృద్ధి పరచడానికి అగ్రిమెంట్ మీద రాసి ఇచ్చిన ఈ 110 ఎకరాలు భూములను కాలక్రమంలో ఈ వ్యక్తులే రాజకీయ పలుకుబడితో అధికారులను లోపరుచుకొని వందల ఎకరాల దేవాలయ భూములను ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని అన్నారు. సర్వే నెం. 173/ 7,8,9,16 లలో గ్రామం లో నలుగురు పేద వ్యక్తులకు పట్టాలు ఇచ్చిన స్కెచ్‌లో లేకుండా చేసేశారన్నారు. సర్వే నెం. 173/ 3,4 అమ్మవారు గుడి కుడి వైపున ఎదురుగా గెడ్డ వరకు 3 1/2 ఎకరాలు భూమి ని కబ్జాదారులు 2023లో సిమెంట్ స్తంభాలతో ఫెనిషింగ్ వేసి సర్వే నెం.173ని సర్వే నెం.258 చూపించి అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ ఫెనిషింగ్ 2023 లో గ్రామస్తులంతా ఏకమై తొలగించగా అక్రమణదారులే బరితెగించి గ్రామంలో 18 మంది పై అక్రమ కేసులు పెట్టారని గ్రామస్తులు వాపోతున్నారు. కేసు పెండింగ్ లో ఉండగా మళ్ళీ ఫెనిషింగ్ వేసి మొక్కలు నాటుతున్నారని తెలిపారు. అమ్మవారు గుడి వెనకాల చెరువులో అనుమతులు లేకుండా స్థానిక సర్పంచ్ కూడా చెప్పకుండా చెక్ డాం నిర్మాణం చేపట్టడం, నెలరోజులు క్రితం అమ్మవారి చెరువులో అనుమతులు లేకుండా ఆక్రమణ దారులు ఇష్టానసారంగా ఆకీసు, సరుగుడు, యూకలిప్ట్ చెట్లు అక్రమంగా నరికేసి దండిగా సొమ్ము చేసుకుంటున్నారని గ్రామంలో వారి అక్రమాలు, అన్యాయాలను అడిగితే ఎదురుతిరిగి అక్రమ కేసులు పెట్టి భయాందోళనలు కలిగిస్తున్నారని స్థానిక మహిళలు కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు మాకు న్యాయం చేయడం లేదని అంగ బలం, అర్థ బలం చూసుకొని భూ బకాసురులు ఇష్టరాజ్యం గా బరి తెగించి వందల ఎకరాలు కబ్జాలు కు పాల్పడుతున్న ఆక్రమణ దారులకే అధికారులు, ప్రజాప్రతినిధులు కొమ్ము కాస్తున్నారని గ్రామస్తులైన పెద్దలు, యువకులు, మహిళలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అనకాపల్లి కలెక్టర్ స్పందించి కబ్జాలకు గురైన వందల ఎకరాల పడమటమ్మ అమ్మవారి భూములను జేసీ, ఆర్డీవో, స్థానిక తహసీల్దార్లతో ఎంక్వయిరీ వేసి అమ్మవారి భూములను అమ్మవారికి అప్పగించి, గ్రామంలో పేదలైన వారికి పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ



**గొలుగొండ (విశాఖ సమాచారమ్):** బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు.

# క్రీడా సమాచారమ్

## 15 రోజుల్లో ఓడలు బండ్లు.. బండ్లు ఓడలు



ఐపీఎల్‌లో అత్యధికసార్లు ప్లేఆఫ్స్‌కు చేరుకున్న జట్లంటే ఠక్కున ముంబయి, చెన్నై గుర్తుకొస్తాయి. ఎక్కువసార్లు విజేతగా నిలిచిన టీమ్‌లూ ఇవే. ఈసారి మాత్రం విజయాల కోసం ఇబ్బందిపడటం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మార్చి 22న 18వ ఎడిషన్ మొదలైన సంగతి తెలిసిందే.

ఐపీఎల్ 2025 సీజన్‌లో కొత్త ఛాంపియన్‌ను చూస్తామా? పక్షం రోజులుగా జరిగిన మ్యాచులను చూస్తే పరిస్థితి అలాగే ఉంది. ఒక్కసారి టాప్-4లో నిలిచిన జట్లను చూస్తే నిజమేనేమోననిపిస్తుంది. మొన్నటివరకు ఈ జట్లను ఎవరూ పట్టించుకోలేదు. తొలి నాలుగులో 'ఆ మూడు' తప్పక ఉంటాయని వేసిన అంచనాలు తలకిందులయ్యాయి. ఇలాంటివి చూసే 'ఓడలు బండ్లు .. బండ్లు ఓడలు అవుతాయ్' అన్న సామెత పుట్టుకొచ్చినట్లుంది.

గత ఎడిషన్‌లో రఫ్ ఆడించిన టీమ్‌లు ఈసారి కుదేలవుతున్నాయి. మొన్నటివరకు తక్కువగా అంచనా వేసిన మరికొన్ని జట్లు మాత్రం ఉరికే ఉత్సాహంతో ముందుకుసాగుతున్నాయి. 'మనదే కప్' అని ఇంకెన్నిసార్లు చెబుతారంటూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై అసహనం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ జట్టే ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తోంది. ఐదుసార్లు ఛాంపియన్‌లుగా నిలిచిన ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌కు కష్టకాలం తప్పడంలేదు. ఐపీఎల్‌లో రికార్డుల మీద రికార్డులు సాధించిన సన్‌రైజర్స్ పరిస్థితేంటో ప్రత్యక్షంగా చూస్తున్నాం. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ పడుతూ లేస్తూ ముందుకుసాగుతోంది. ఇక రాజస్థాన్ రాయల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పరిస్థితి ఇందుకు భిన్నమేమీ కాదు.

**ఆ మూడు మినహా..**

ఐపీఎల్ 18వ సీజన్‌లో మూడు జట్లు మినహా మిగతావి కనీసం నాలుగు మ్యాచులు ఆడేశాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అయితే ఐదు మ్యాచులు ముగిశాయి. కేవలం ఒక్క విజయం మాత్రమే సాధించి ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. దిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మాత్రమే మూడేసి మ్యాచులు ఆడాయి. అక్షర్ పటేల్ సారథ్యంలోని దిల్లీ (6) అనూహ్యంగా మూడింట్లో గెలిచి అగ్రస్థానంలో కొనసాగుతోంది. గుజరాత్ (6) నాలుగింట్లో మూడు గెలిచి రెండులోకి దూసుకొచ్చింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (4) తొలి రెండు మ్యాచుల్లో గెలిచి జోష్ మీదుంది. గత మ్యాచ్‌లోనూ ఓడినా... ఈసారి ఆర్సీబీని తక్కువగా అంచనా వేసేందుకు వీల్లేదు. ఓపెనర్లతోపాటు మిడిలార్డర్ బలంగా తయారైంది. గత సీజన్ వరకు బౌలింగ్‌లో ఇబ్బందిపడిన ఆర్సీబీ స్ట్రాంగ్ అయింది. భువీ చేరికతో జోష్ హేజిల్‌వుడ్, యశ్ దయాళ్ కూడిన పేస్ విభాగం పటిష్ఠంగా తయారైంది. ఇక కెప్టెన్సీని మార్చిన పంజాబ్ కింగ్స్ అందుకు తగినట్లుగానే ఫలితం రాబడుతోంది. శ్రేయస్ అయ్యర్ ముందుండి జట్టును గెలిపిస్తున్నాడు. మూడు మ్యాచుల్లో రెండు విజయాలు నమోదు చేసిన పంజాబ్ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

**ఈ మూడు కిందనే..**

ధోనీ నామస్మరణతో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ 2025 సీజన్‌ను ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో ముంబయిపై గెలిచి సీఎస్కే బోణీ కొట్టింది. ఆ తర్వాత హ్యాట్రిక్ కొట్టింది. కానీ అది ఓటముల్లో. ఇందులో చెపాక్ వేదికగా జరిగిన మ్యాచులూ ఉన్నాయ్. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో విఫలం కావడం ఆ జట్టుకు నష్టం చేసింది. ఇక ముంబయి అయితే బుమ్రా లేకపోవడంతో బౌలింగ్‌లో కాస్త వీక్‌గా అనిపించింది. బ్యాటింగ్‌లోనూ సూర్య, నమన్ ధీర్ మినహా.. మిగతా వారి నుంచి పెద్దగా పరుగులు రావడం లేదు. తిలక్, హార్దిక్ మ్యాచ్‌ను ముగించడంలో విఫలమవుతున్నారు. మూడు మ్యాచుల్లో తేలిపోయిన రోహిత్ శర్మ నాలుగో పోరులో బెంచ్‌కే పరిమితం కావడం గమనించాల్సిన విషయం. సన్‌రైజర్స్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భారీ హిట్టర్లు ఉన్న జట్టు.. తొలి మ్యాచ్ మినహా మిగతావాటిల్లో కనీసం 200 స్కోరు చేసేందుకూ ఇబ్బందిపడుతోంది. ఇక బౌలింగ్ సంగతి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. కెప్టెన్ పాట్ కమిన్స్ బ్యాటింగ్‌లో చూపిస్తోన్న దూకుడు.. బౌలింగ్‌లో కరవైంది. ఇక సీనియర్ పేసర్ షమీ వికెట్లు తీయడం పక్కనుంచి.. పరుగులు ఇవ్వడం ఎక్కువైంది. మున్ముందు మ్యాచుల్లో కుదురుకొని ఆడకపోతే '2022' సీజన్ పరిస్థితి రిపీట్ కావడం ఖాయమనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. అప్పుడు కూడా సీఎస్కే, ముంబయి, సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో చివరన నిలిచాయి.

## నూర్‌అహ్మద్‌పై తీవ్ర వ్యాఖ్యలు..

### అశ్విన్ యూట్యూబ్ ఛానల్ వివరణ

**ఇంటర్నెట్ డెస్క్:** ఈ ఐపీఎల్ సీజన్‌లో ఎన్నో అంచనాలతో వచ్చిన చెన్నై సూపర్ కింగ్స్ పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తోంది. ఇప్పటి వరకూ ఆడిన నాలుగింట్లో మూడు ఓడింది. ఇక జట్టు తరఫున కీలక బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపించడం లేదు. ఆ జట్టు తరఫున ఆకట్టుకుంటుంది మాత్రం స్పిన్నర్ నూర్ అహ్మదే . ఇప్పటి వరకూ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. అయితే.. అతడిపై సొంత జట్టు ఆటగాడికి చెందిన యూట్యూబ్ ఛానల్ విమర్శలు చేసి వివాదంలో చిక్కుకుంది.



ఈ నెల 5న దిల్లీపై జరిగిన మ్యాచ్‌లో చెన్నై ఓడిపోయింది. ఈ సందర్భంగా రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో ఒక ప్యానలిస్టు మాట్లాడుతూ.. నూర్‌పై నోరుపారేసుకున్నాడు. అతడిని మెగా వేలంలో చెన్నై కొనుగోలు చేసి ఉండాల్సింది కాదని తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో అశ్విన్ ఛానల్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. చెన్నై మ్యాచ్‌ల కవరేజీకి దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. "గత వారం రోజులుగా ఈ ఫోరమ్‌లో జరిగిన చర్చలను దృష్టిలో ఉంచుకుని.. ఈ సీజన్‌లో మిగతా సీఎస్కే మ్యాచ్‌ల కవరేజ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ఛానల్‌లో అతిథులు వ్యక్తపరిచిన అభిప్రాయాలకు అశ్విన్‌కు ఎలాంటి సంబంధం లేదు" అని ఆ ఛానల్ అడ్మిన్ వెల్లడించాడు.

అంతకుముందు ఇదే విషయంపై చెన్నై కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. "అతడికి ఒక ఛానల్ ఉందన్న విషయం నాకు తెలియదు. వాటిని నేను అనుసరించను" అంటూ వ్యాఖ్యానించాడు. ఇక వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిన చెన్నై.. తన తదుపరి పోరులో ఈ నెల 8న పంజాబ్‌తో ఆడేందుకు సిద్ధమవుతోంది.

## ద్రవిడ్‌తో అన్నట్లుగా.. 'రో - కో'కు చెప్పలేను: పాంటింగ్



**ఇంటర్నెట్ డెస్క్:** భారత టాప్ ప్లేయర్ల జాబితాలో రోహిత్, విరాట్ కోహ్లీ ఉంటారు. ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచ కప్‌లను అందించారు. ప్రస్తుతం వీరు ఐపీఎల్‌లో ఆడుతున్న సంగతి తెలిసిందే.

తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు క్రికెటర్లు ఒకరికొకరు బాసటగా నిలుస్తుంటారు. భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ మధ్య మైదానంలో ఎంతటి పోటీ ఉన్నా బయట మాత్రం మంచి అనుబంధం ఉంది. 2007/08 సమయంలో రాహుల్ ద్రవిడ్ టెస్టు కెరీర్ ముగింపు దశకు చేరుకుంది. నాలుగు టెస్టుల్లో 33.85 సగటుతో 237 పరుగులు మాత్రమే చేశాడు. ఆ సమయంలో తమ మధ్య సంభాషణను రికీ పాంటింగ్ గుర్తు చేసుకున్నాడు.

"అప్పటికి ద్రవిడ్ చాలా పోరాటం చేశాడు. భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ సమయంలో మాత్రం ఫామ్‌పరంగా ఇబ్బందిపడ్డాడు. బయట నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. మేమిద్దరం మైదానంలోనే పోటీదారులం. ఇరు జట్లకూ మూడో స్థానంలో వచ్చి ఆడేవాళ్లం. ఈక్రమంలో ఓసారి అతడితో మాట్లాడా. 'బయట ఏం అనుకుంటున్నారో మరిచిపో. నీపై నువ్వు నమ్మకం పెట్టుకో. నువ్వొక అద్భుతమైన ప్లేయర్‌వి. కేవలం ఆటపైనే దృష్టిపెట్టు. చిన్న విషయాలను వదిలేయ్. తప్పకుండా గొప్పగా కెరీర్‌ను ముగిస్తావు' అని చెప్పా. అతడూ అలాగే చేశాడు. కానీ, ఆ తర్వాత నాకు కూడా ఇలానే సందేశం వచ్చింది. నాకు ఫోన్ చేసిన తొలి వ్యక్తి ద్రవిడ్‌నే" అని పాంటింగ్ వెల్లడించాడు.

**వారిని ఆపొద్దు..**

"నాణ్యమైన ప్లేయర్ల సత్తాను ఎక్కడా తగ్గించలేరు. వారు ఛాంపియన్లుగా మారడానికి ప్రధాన కారణం కూడా అదే. నిరంతరం తమను నిరూపించుకోవడానికి మార్గాలను అన్వేషిస్తూనే ఉంటారు. గత కొన్నేళ్లలో విరాట్ కోహ్లీ ఒడిదొడుకులను చవిచూశాడు. విరాట్ అత్యున్నత క్రికెటర్. రోహిత్ కూడా ఈ జాబితా ప్లేయర్. ఇప్పుడు వారిద్దరికీ టెస్టు క్రికెట్ క్లిష్టంగా మారింది. నేను ఇప్పటివరకు చూసిన వారిలో విరాట్ కోహ్లీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బెస్ట్ ఆటగాడు. అందుకే, ద్రవిడ్‌కు ఇచ్చినట్లుగా రోహిత్, విరాట్‌కు సందేశం పంపలేను. వారిద్దరూ మరికొంత కాలం క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నా. ఐపీఎల్ విభిన్నమైంది. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ రోహిత్-విరాట్ ఆటను చూడాలనేదే నా ఆకాంక్ష" అని పాంటింగ్ వ్యాఖ్యానించాడు.

## విశాఖలో జనసేనానికి ఘన స్వాగతం









**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ జనసేన, ఇతర కూటమి నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అలాగే పెందుర్తి కూడలి మీదగా వెళు తున్న పవన్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది, ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి శాసనసభ సభ్యుడు పంచకర్ల రమేష్ బాబు, మాజీ శాసనసభ సభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు , సేనాపతి శంకర్రావు , బల్ల శ్రీనివాసరావు , వేగి పరమేశ్వర రావు తదతరులు ఘన స్వాగతం పలికారు . కాగా విశాఖ నుంచి నుంచి నేరుగా డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి డిప్యూటీ సీఎం చేరుకున్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి నిమిత్తం చేస్తున్న 'అడవితల్లి బాట' కార్యక్రమానికి పెదపాడు గ్రామంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మారుమూల పల్లెల్లో చేపట్టనున్న రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి బహిరంగ సభలో పాలొన్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు కోసం 20వేల మంది గిరిజన యువతీయువకులు చేపడుతున్న 108 సూర్య నమస్కారాల కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే మంగళవారం ఉదయం అరకు మండలంలోని సుంకరమిట్ట చేరుకుని పైవంతెనను ప్రారంభిస్తారు. అనంతరం విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్‌కు చేరుకుని ఎకో టూరిజంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, ఎకో టూరిజానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారు.

## మెడికవర్ ఆసుపత్రి లో మిస్సో రోబోట్ ప్రారంభం

### అధునాతన టెక్నాలజీ రోబో సహాయంతో మోకాలి శస్త్ర చికిత్స



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రోబోటిక్ విధానం ద్వారా మోకాళ్ళ సమస్యలను నయం చేసే మిస్సో ఆర్థోసర్జికల్ రోబోట్ ను నగరంలోని మెడికవర్ హాస్పిటల్ లో ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రోబోటిక్స్ వైద్య విధానం ద్వారా రోగులకు ఎంతో స్వాంతన చేకూరుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. డాక్టర్ ఏ. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మోకాళ్ళ మార్పిడి ద్వారా వైద్య ప్రక్రియను కొనసాగిస్తున్నామని, తాజాగా ప్రారంభించిన రోబోటిక్ విధానం తో 24 గంటల్లోనే రోగి కోలుకుంటారని వివరించారు. మోకాళ్ళ మార్పిడి చేపట్టిన సందర్భంలో కొందరు భయపడతారని, నొప్పి అధికంగా ఉంటుందని, వృద్ధాప్యంలో ఎటువంటి సమస్యలు ఉంటా యోనని మానసికంగా కూడా కలత చెందుతారని..అయితే రోబోటిక్ విధానం వలన అటువంటి కలత ఉండదని అన్నారు. డాక్టర్ గంగవరపు శ్రీధర్ మాట్లాడుతూ మోకాళ్ళ మార్పిడి నిర్వహించిన అనంతరం ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఐసియు లో ఉంచుతామని, రోబోటిక్ విధానం తో అలా కాకుండా త్వరితగతిన కోలుకోవచ్చన్నారు. డాక్టర్ యస్.ప్రవీణ్, మరియు డాక్టర్ యన్.వి.యస్.వినయ్ మాట్లాడుతూ రోబో ని ఉపయోగించడం వలన ఖచ్చితత్వం, తక్కువ రక్త స్రావం, త్వరితంగా కోలుకోవడం వంటి ప్రయోజనాలు వున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రీజనల్ హెడ్ పద్మజ, సెంటర్ హెడ్ అరుణ్ పాల్గొన్నారు.



### తాండవ రిజర్వాయర్ ఎడమ కాలువ పనుల పరిశీలన

**నాతవరం, (విశాఖ సమాచారమ్) -** తాండవ రిజర్వాయర్ ఎడమ కాలువ నుండి కోటనందూరు మండలానికి నీళ్లు వెళ్లే డ్రాప్ దగ్గర జెడ్ ఎస్కేప్ గేట్ల మరమ్మతులను తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నాతవరం మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అప్పిరెడ్డి మాణిక్యం, శివలంక, మరిడేశ్వరరావు, మాధవనగరం టీడీపీ నాయకులు, జేఈ శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బగ్గు సరోజినీ దేవి హాస్పిటల్
Baggu Sarojini Devi HOSPITAL
అత్యుత్తమ వైద్య ప్రమాణాలకు భరోసా
PARALYSIS STROKE UNIT
TRAUMA CARE
CT SCAN
16 Ch. MRI SCAN





HIGH RISK PREGNANCY CARE
LAPAROSCOPIC SURGERIES
HYSTEROSCOPIC SURGERIES
INFFERTILITY & IVF
న్యూరాలజీ వైద్య సేవలలో అగ్రగామి
న్యూరాలజి | జనరల్ & ఎమర్జెన్సీ మెడిసిన్ | ఆర్థోపెడిక్స్ & ట్రామా
గైనకాలజి & లేప్రోస్కోపిక్ సర్జరి | జనరల్ సర్జరి | న్యూరోసర్జరి | పల్మనాలజి
Network Hospital For All Insurance Companies, TPAs, EHS & Aarogyasri
సెల్ : 08942 - 279696, 279633 | www.bsdhospitals.com
ఇలిసిపురం, శ్రీకాకుళం | 9490904141


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,
గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.